
మాగుంట సుబ్బరామి రెడ్డి
నిస్పక్షపాతం..సత్యనిష్ఠ.. అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు ఆవశ్యం

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914



కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 110 • పేజీలు : 8 • సోమవారం 20 జనవరి 2025 • వెల : రూ. 5.00 Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


## ప్రజాశక్తిని బలోపేతం చేయాలి



- కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక
- ఎన్నికల ప్రక్రియను ఈసీ పటిష్ఠం..
- ఈ రిపబ్లిక్ డే వేడుకలు చాలా ప్రత్యేకమైనది
- ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణం
- ప్రధాని నరేంద్ర మోదీ

**దిల్లీ,జనవరి 19 :** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అన్ని మిగతా 7లో

- విధ్వంసం గురించి చింతించొద్దు.. మూడింతల ప్రగతి సాధిస్తాం
- విపత్తుల వేళ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని చూస్తే ప్రజలు నిశ్చింతగా ఉంటారు..
- ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అనూహ్య విజయం అందించిన అందరికీ ధన్యవాదాలు
- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో మూడింతల ప్రగతి సాధిస్తాం
- ఆరు నెలల్లో ఎపికి రూ. 3లక్షల కోట్ల విలువైన సహకారం అందించాం..
- 2028లోపు ఎపి మొత్తం పోలవరం ద్వారా నీళ్లు పారిస్తాం..
- పార్టీ పరంగా కార్యక్రమాలు.. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయండి




# ఎపిలో 'అభివృద్ధి' పరుగులు

### ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**గన్నవరం,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** విపత్తుల వేళ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని చూస్తే ప్రజలు నిశ్చింతగా ఉంటారని కేంద్ర హెూంమంత్రి అమిత్ అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ సేవలను ఇతర దేశాల నేతలూ ప్రశంసించారని గుర్తుచేశారు. విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో అమిత్ షా మాట్లాడారు. "ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అనూహ్య విజయం అందించిన అందరికీ ధన్యవాదాలు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏవిధంగా ధ్వంసం చేసిందో అందరికీ తెలిసిందే. అప్పుడు జరిగిన విధ్వంసం గురించి మిగతా 7లో

## ఎన్డీఆర్ఎఫ్ సేవలు గొప్పవి

- ఏ విపత్తు వచ్చినా మొదట గుర్తుకు వచ్చేది..ఎన్డీఆర్ఎఫ్
- 5 రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చేలా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రాంగణం ఏర్పాటు
- దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు కేంద్రం మద్దతు ఇంకా కావాలి
- ఎపి సిఎం చంద్రబాబు నాయుడు



**గన్నవరం,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** ఏ విపత్తు వచ్చినా ఎన్డీఆర్ఎఫ్ మొదట గుర్తొస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు మిగతా 7లో

## నా కుమారుడికి మరణ శిక్ష విధించండి

- ఆర్జీకర్ దోషి తల్లి




**కోల్‌కతా,జనవరి 19 :** ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌ను కోల్‌కతా కోర్టు దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై అతడి తల్లి స్పందించారు. తన కొడుకు తప్పు చేస్తే కచ్చితంగా తగిన శిక్ష విధించాలని పేర్కొన్నారు. తన కుమారుడు చేసిన తప్పును ఓ మహిళగా ఎప్పటికీ క్షమించనని మిగతా 7లో

## టిటిడికి రూ.6 కోట్ల విరాళం



**తిరుమల,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** చెన్నైకి చెందిన దాత శ్రీ వర్ధమాన్ జైన్ ఆదివారం టిటిడి ట్రస్టులకు రూ.6 కోట్లు విరాళంగా అందించారు. తిరుమల ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆయన ఎస్వీబీసీ కోసం రూ.5 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కోసం రూ. కోటి విలువైన డిడిలను టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## రాహుల్‌పై మరో కేసు..



**గువహటి,జనవరి 19 :** కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. మోర్జిత్ చాటియా అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు అస్సాం రాజధాని గువహటిలోని పాన్ బజార్ పోలీస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. బిఎన్ఎస్ సెక్షన్ 152, 197 (1)డి ప్రకారం.. దేశ సార్వభౌమత్వం, ఐక్యత మరియు సమగ్రతకు హాని కలిగించే చర్యలు కింద నాన్ బెయిలబుల్ కేసు మిగతా 7లో

- నేడు దావోస్‌కు ఎపి సిఎం చంద్రబాబు బృందం
- 3 రోజులపాటు దావోస్‌లో చంద్రబాబు పర్యటన
- పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా దావోస్ పర్యటన
- రాత్రికి ఢిల్లీనుంచి జ్యూరిచ్ వెళ్లనున్న చంద్రబాబు
- జ్యూరిచ్‌లో భారత రాయబారితో భేటీకానున్న చంద్రబాబు
- ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రముఖులతో భేటీకానున్న సిఎం

## పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన





**అమరావతి, జనవరి 19 (ఆంధ్రపత్రిక):** సీఎం చంద్రబాబు నాయుడు నేడు దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదివారం సాయంత్రం అమరావతి నుంచి ఢిల్లీ చేరుకుని.. అర్ధరాత్రి తన బృందంతో కలిసి స్విట్జర్లాండ్లోని జ్యూరిచ్‌కు బయల్దేరతారు.బ్రాండ్ మిగతా 7లో



## ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్

- సింగపూర్‌లో ముగిసిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటన
- ఈసారి మరింత ఎక్కువ పెట్టుబడులు వచ్చే అవకాశం

**హైదరాబాద్,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** సింగపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటన ముగిసింది. పర్యటనలో భాగంగా ఆదివారం సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ప్రతినిధులతో రాష్ట్ర బృందం చర్చలు జరిపింది. ఇండియన్ ఓషియన్ గ్రూప్ సీఈవో ప్రదీప్, డీబీఎస్, బ్లాక్ స్టోన్, మైన్ హార్ట్ కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మిగతా 7లో

## గిరిజనులకు అండగా ఉండాలి



- గిరిజనులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

**విజయవాడ,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** గిరిజనులు సంఘటితంగా ఉంటూ నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని మాజీ మిగతా 7లో

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..!



- బంగాళాఖాతంలో ఆవర్తనం..ఏకధాటి వర్షాలు
- ఈ ఆవర్తనం మరింత బలపడే అవకాశం ఉంది..
- ఎపిలో కూడా భారీ వర్షాలు పడే అవకాశం...
- బెంగళూరులో ఏకధాటిగా దంచి కొట్టిన వర్షం
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ

**అమరావతి,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావం రెండు రాష్ట్రాలపై తీవ్రంగా పడింది. కర్ణాటక, తమిళ నాడులో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతోన్నాయి. రాత్రి నుంచి మిగతా 7లో

## అసత్య ప్రచారాలు మానుకోండి

- వైసిపి విష ప్రచారాన్ని ప్రజలెవ్వరూ నమ్మొద్దు..
- ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం...
- సూర్యఘర్ పథకాల వల్ల నష్టమేంటో జగన్ చెప్పాలి..?
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు అంటూ వైసీపీ చేసే విషప్రచారాన్ని మిగతా 7లో

## గందరగోళంగా మారిన కుంభమేళా



- కుంభమేళాలో భారీ అగ్నిప్రమాదం
- మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- కాలి బూడిదైన 20 నుంచి 25 టెంట్లు..
- అరుపులతో పరుగులు తీసిన భక్తులు

**ప్రయాగరాజ్,జనవరి 19 :** ప్రయాగరాజ్‌లో మహాకుంభ మేళాలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భక్తుల కోసం ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద ఒక్క సారిగా మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో, భక్తుల్లో ఆందోళన మొదలైంది. ఆందోళనతో భక్తులు అరుపులు.. మిగతా 7లో



## కొలికపూడి వ్యవహారం..

- నేడు టిడిపి క్రమశిక్షణా సంఘం ముందుకు తిరువూరు ఎమ్మెల్యే
- ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామానికి చెందిన..మహిళతో దురుసుగా ప్రవర్తించినట్లు అభియోగం..
- కమిటీకి వివరణ ఇవ్వనున్న ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్

7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# చైనాపై దృష్టి పెట్టాల్సిందే!

చైనా ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉంటుంది. పొరుగు దేశాలను గుప్పిట్లో ఉంచుకోవడం, ఎదుగుతున్న దేశాలకు ఎసరు పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. కరోనాతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన చైనా తన మనుగడ, పెత్తనం కోసం ఎంతకైనా తెగిస్తుందని రుజువు చేసింది. తాజాగా హెచ్ఎంపివి వైరస్ కూడా ఇలాంటిదే. కరోనా సమయంలోనూ తమకు సంబంధం లేదని బుకాయించింది. అలాగే ఇప్పుడీ కొత్త వైరస్‌పైనా ప్రపంచాన్ని బుకాయిస్తోంది. ఎలాంటి ప్రాణాంతకం కాదని చెబుతోంది. చైనా తన మార్కెట్ పరిధిని పెంచుకునే ప్రయత్నంలో ఎలాంటి దురాగతాలకైనా పాల్పడుతుందనడానికి ఇవి నిదర్శనాలు. ఇకపోతే ఇప్పుడు చైనాతో అతిపెద్ద ముప్పు ఏర్పడబోతోంది. భారత్, నేపాల్‌లతో చైనా తన సరిహద్దుల ముక్కోణపు కూడలికి బాగా దగ్గరగా యార్లుంగ్ జాంగ్బో నదిపైన, గంగా ఉపనదిపైన టిబెట్‌లో కొత్త డ్యామ్‌ను నిర్మిస్తున్నదని వార్తలు వచ్చాయి. ఈ వార్త కొన్ని సంవత్సరాలుగా వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైంది. నిజానికి ఈ డ్యామ్ నిర్మాణం జరిగితే భారత్ భద్రతకు తీవ్ర ముప్పు ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో అలాంటిదేమీ లేదని తాజాగ ఆచైనా ప్రకటించింది. దీంతో భారత్‌కు ఎలాంటి ఉపద్రవం రాదని న మ్మబలికింది. చైనా ప్రభుత్వం బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు అయిన యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతాల్లో ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించింది. జల విద్యుత్ ప్రాజెక్టు యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతంలో ఉంటుంది. హిమాలయ ప్రాంతంలో ప్రధాన ఇరుకైన లోయలో డ్యామ్ నిర్మాణం జరుగుతుంది. అక్కడ నది నాటకీయంగా మలుపు తీసుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవహించి, చివరగా బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. ఆ డ్యామ్ చైనాకు నదీ ప్రవాహంపై నియంత్రణాధికారం కల్పిస్తుందని, ప్రాజెక్టు స్థాయి కారణంగా సరిహద్దు ప్రాంతాలను వరదల్లో ముంచెత్తేందుకు అవకాశం ఇస్తూ, సంక్షోభ సమయాల్లో అధిక మొత్తంలో నీటి విడుదలకు వీలు కల్పిస్తుందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. కానీ, బ్రహ్మపుత్ర నదిపై చైనా భాగంలో డ్యామ్ నిర్మాణాన్ని ఆమోదించాలన్న తన నిర్ణయాన్ని చైనా సమర్థించుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించాలన్న చైనా యోచనపై భయాందోళనలు అనవసరమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ డిసెంబర్ 27న అన్నారు.మెగా ప్రాజెక్టు దిగువ నదీ పరివాహక దేశాలను ప్రభావితం చేయదని, దశాబ్దాల తరబడి అధ్యయనాల ద్వారా వాటి భద్రత ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సరి చేయడమైందని మావో నింగ్ స్పష్టం చేశారు, 137 బిలియన్ డాలర్ల ప్రాజెక్టును టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దు పొడుగునా పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతంలో నిర్మిస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద డ్యామ్ ప్రభావం పల్లపు ప్రాంతాలపై పడదని ఆమె చెప్పారు. ఆ డ్యామ్‌ను ఉపగ్రహ చిత్రాల ఆధారంగా దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం నియంత్రణ కు చైనా ఉపయోగించుకోవచ్చు. చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్‌హువా వార్తా సంస్థ ఉటంకించిన అధికార ప్రకటన ప్రకారం, తుదకు 2024 డిసెంబర్ 25న అన్ని సందేహాలను పరిహరిస్తూ వెలువరించింది. ఇప్పుడు భారత్ అభ్యంతరం చెప్పడంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని అంటోంది. సీమాంతర నదుల అభివృద్ధి పట్ల చైనా ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటున్నట్లు, టిబెట్‌లో జలవిద్యుత్ అభివృద్ధిపై దశాబ్దాల పాటు అధ్యయనం చేసినట్లు, ప్రాజెక్టు భద్రతకు, పర్యావరణ, వాతావరణ పరిరక్షణకు సముచిత చర్యలు తీసుకున్నట్లు మావో నింగ్ చెబుతున్నా నమ్మశక్యంగా లేవు. భారత సరిహద్దుకు సమీపంగా టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై 137 బిలియన్ యుఎస్ డాలర్లు విలువ చేసే భూగ్రహంపై అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టుగా పేర్కొంటున్న ప్రపంచంలోనే ప్రతిపాదిత అతిపెద్ద డ్యామ్ నదీ పరివాహక దేశాలు భారత్, బంగ్లాదేశ్‌లలో ఆందోళనలు కలిగిస్తోంది. డ్యామ్‌పై మొత్తం పెట్టుబడి ఒక ట్రిలియన్ యువాన్లు (137 బిలియన్ డాలర్లు) దాటిపోగలదు. ప్రపంచంలోనే అతిపెద్దదిగా పరిగణిస్తున్న చైనా సొంత త్రీ గాడ్జెస్ డ్యామ్ సహా ఈ గ్రహంపై ఏ ఇతర ఒక్క మౌలికవసతుల ప్రాజెక్టు ఖర్చును మరుగుజ్జును చేస్తుంది. హిమాలయ పర్వత ప్రాంతంలో ఒక భారీ లోయలో డ్యామ్‌ను నిర్మించడమన్నది పొరుగున ఉన్న మనపై జలయుద్ధ ట్యాంకును ఎక్కు పెట్టడమే. కైలాస శిఖరం నుంచి టిబెట్ మీదుగా భారత్, బంగ్లాదేశ్‌లకు పేర్ల మార్పుతో ప్రవహిస్తున్న నదిపై మెగా డ్యామ్‌ల నిర్మాణం గురించి పోటాపోటీగా వ్యవహరిస్తున్నా రెండు దేశాలు సీమాంతర నదులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించేందుకు 2006లో నిపుణుల స్థాయి యంత్రాంగం ను ఏర్పాటు చేశాయి. దాని కింద వరద కాలాల్లో బ్రహ్మపుత్ర నది, స్లటెజ్ నదికి సంబంధించి జలప్రవాహ సమాచారాన్ని భారత్‌కు చైనా అందజేస్తున్నది. సరిహద్దు అంశానికి సంబంధించి భారత, చైనా ప్రత్యేక ప్రతినిధులు ఎన్ఎస్ఏ అజిత్ దోవల్, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి మధ్య డిసెంబర్ 18న బీజింగ్‌లో జరిగిన చర్చల్లో సీమాంతర నదుల డేటా పంచుకోవడమైంది. సీమాంతర దేశాలపై దూకుడుగా వ్యవహరించేందుకు తన డ్యామ్‌లను ఉపయోగించుకుంటున్న చరిత్ర చైనాది. ఏడాది పొడుగునా వర్షపాతంలో గణనీయమైన పెరుగుదల ఉన్నది. జూలై, సెప్టెంబర్ మధ్య గరిష్ఠంగా ఉంటుంది. బ్రహ్మపుత్ర నది రెండు అధిక నీటిమట్టం సీజన్‌లను చూస్తుంటుంది. ఈ క్రమంలో బ్రహ్మపుత్ర ద్వారా నీటిని ఒక్కసారిగా వదిలితే అది భారత్‌ను ముంచెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళన వస్తోంది. దీంతో దీనిపై భారత్ గట్టిగానే వ్యతిరేకిస్తున్నా..అడ్డుకోవడమే మంచిది.

# జనం మెచ్చిన నటుడు కృష్ణంరాజు



తెలుగు చిత్ర రంగాన ఆయనో రెబల్ స్టార్.. ప్రేక్షకుల గుండెల్లో గూడుకట్టుకున్న సూపర్ స్టార్...ఆయనే కృష్ణంరాజు... కృష్ణంరాజు పేరు వినగానే ఓ ప్రేమికుడు, ఓ అన్న, ఓ మేనమామ, ఓ విలన్ గుర్తుకొస్తారు.. ఏ పాత్రకాపాత్ర అన్నట్టు అన్ని పాత్రలతో మెప్పించి ఒప్పించిన మహ నటుడాయన. మేనమామగా పల్నాటి పౌరుషం చూపాలన్నా బొబ్బిలి బ్రహ్మన్నగా రౌద్ర రసం ప్రదర్శించాలన్నా ఆయనకే చెల్లింది. కెరీర్ ఆరంభంలో ప్రతి నాయక పాత్రలు అనేకం చేసి మెప్పించారు.. ఆ తరువాత భక్త కన్నప్ప లాంటి కరుణ రస పాత్రలు చేసి ప్రేక్షకులను మైమంపించారు. తాను ఎలాంటి పాత్రనైనా అవలీలగా చేయగలనని నిరూపించారు. ఎన్టీఆర్, ఏఎన్నార్‌తో పాటు తన తరం హీరోల సిని మాల్లో విలన్‌గా, సైడ్ హీరోగా నటించిన కృష్ణంరాజు యువ కథనాయకులతోనూ కలిసి నటించారు. వరసగా విలన్ చిత్రాలు చేసిన ఆయన కొద్ది కాలంలోనే మళ్లీ హీరోగా పుంజుకున్నారు. ఆయన పూర్తి పేరు శ్రీ ఉప్పలపాటి చినవెంకట కృష్ణంరాజు.. ఇంటిపేరులోని శ్రీని పేరులోని చినవెంకట పదాలను తొలగించుకొని కృష్ణంరాజుగా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. కృష్ణంరాజు 1940 జనవరి 20న పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో జన్మించారు. ఫోటోగ్రఫీపై ఉన్న మక్కువతో హైదరాబాదులో రాయల్ స్టూడియో మొదలుపెట్టారు. అలాగే ఆయన ఆంధ్రరత్న పత్రికలో ఫోటోగ్రాఫర్‌గా కూడా పనిచేశారు. ఆయన తీసిన ఫోటోలకుగానూ రాష్ట స్థాయిలో సెకండ్ బెస్ట్ ఫోటోగ్రాఫర్‌గా అవార్డు కూడా అందుకున్నారు. ఆ తర్వాత మిత్రుల ప్రోత్సాహంతో మద్రాసు రైలెక్కారు. మొదట విలన్‌గా కొన్ని సినిమాలు చేశారు. శోభన్‌బాబు, కృష్ణ వెండితెరకు పరిచయం అయినా కొన్నాళ్లకే 1966లో వచ్చిన చిలకా గోరింకా చిత్రంతో కృష్ణంరాజు.. వెండితెరకు హీరోగా పరిచయం అయ్యారు. అయితే తొలిచిత్రం ఆయనకు నిరాశనే మిగిల్చింది. ఆ సినిమా ఫ్లాప్ కావడంతో నటనలో రాటుదేలేందుకు ప్రముఖులు రాసిన పుస్తకాలు చదవడంతో పాటు పాతకాలం నటుడు సీహెచ్ నారాయణరావు వద్ద శిక్షణ తీసుకున్నారు. నటనలో పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేవరకు ఎన్ని అవకాశాలు వచ్చినా వదులుకున్నారు. డూండీ నిర్మాణ సారథ్యంలో.. అవేకళ్లు చిత్రంలో విలన్‌గా అలరించారు. ఆ చిత్రంలో ఆయన నటనకు మంచి మార్కులే పడ్డాయి. అప్పటికీ విలన్ పాత్రలు వేసే ఆర్.నాగేశ్వరరావు మరణించడంతో , ఆయన స్థానంలో కృష్ణంరాజు వచ్చారని అందరూ భావించారు. తర్వాత వరుసగా 30 చిత్రాల్లో విలన్ వేషాలే వేశారు. ఈ క్రమంలో ఎన్టీఆర్?, ఏఎన్నార్, శోభన్‌బాబు, కృష్ణ చిత్రాల్లో విలక్షణమైన ప్రతినాయకుడి పాత్రలు పోషించి యంగ్ విలన్‌గా పేరు తెచ్చుకున్నారు. ఎన్టీఆర్?తో కలసి 'భలేమాస్టార్', 'బడిపంతులు', 'వాడేవీడు', 'పల్లెటూరి చిన్నోడు', 'మనుషుల్లో దేవుడు', 'మంచికి మరోపేరు', 'సతీసావిత్రి' చిత్రాల్లో నటించారు. అలాగే, అక్కినేని కాంబినేషన్‌లో బుద్ధిమంతుడు, జైజవాన్, పవిత్రబంధం, మంచిరోజులు వచ్చాయి, మాతృమూర్తి చిత్రాల్లో విలన్‌గా నటించి మెప్పించారు. హీరో కృష్ణ కాంబినేషన్‌లో 17 చిత్రాల్లో హీరోగా నటించారు కృష్ణంరాజు. శోభన్‌బాబుతో బంగారు తల్లి, మానవుడు దానవుడు, జీవన తరంగాలు చిత్రాల్లో విలన్‌గా నటించారు. ఇద్దరు ఇద్దరే, కురుక్షేత్రం, రామబాణం, జీవితం చిత్రాల్లో సహాయ పాత్రలు చేశారు. ఆయనను మొదట నుంచీ ప్రోత్సహించిన ప్రత్యగాత్మ దర్శకత్వంలో వచ్చిన ఇంటిదొంగలు చిత్రంతో కృష్ణంరాజు.. తిరి గి హీరోగా మారారు. విలన్‌గా వెలుగొందుతున్న రోజుల్లోనే గోపికృష్ణా మూవీస్ పేరుతో నిర్మాణ సంస్థను స్థాపించి వరుసగా చిత్రాలు నిర్మించారు. స్వంత బ్యానర్‌లో వచ్చిన తొలి చిత్రం కృష్ణవేణి.. పన్నెండు కేంద్రాల్లో శతదినోత్సవం జరుపుకుంది. ఆ చిత్రంతో ఆయన హీరోగా వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో వరుసగా బయటి నిర్మాణ సంస్థల నుంచి హీరోగా అవకాశాలు రావడంతో బిజీగా మారిపోయారు. గోపికృష్ణా మూవీస్‌లో కృష్ణంరాజు నటించిన రెండో చిత్రం భక్తకన్నప్ప.. అప్పట్లో ఈ సినిమా రికార్డులు బద్దలు కొట్టింది. ఆయన కెరీర్‌లోనే గొప్ప చిత్రంగా నిలిచింది. చిత్రం విడుదల అయిన అన్నీ కేంద్రాల్లో విజయ ఢంకా మ్రోగించి ఆయనకు మంచి పేరు తీసుకొచ్చింది. ఇక మూడో చిత్రం విజయం సాధించకపోవడంతో గోపికృష్ణా బ్యానర్‌ను తిరిగి నిలబెట్టేందుకు 1984లో బొబ్బిలి బ్రహ్మన్న చిత్రాన్ని నిర్మించారు. రాఘవేంద్రరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఆ చిత్రం అఖండ విజయాన్ని సాధించి కృష్ణంరాజు నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరించింది. బొబ్బిలి బ్రహ్మన్న తర్వాత తాండ్రపాపరాయుడు చేశారు. తాండ్రపాపరాయుడు పాత్రలో ఆయన ప్రదర్శించిన రౌద్రరసం సినీ విమర్శకులను మెప్పించింది. ఇక బాపు దర్శకత్వంలో వచ్చిన బుల్లెట్ చిత్రంలో మొరటోడిగా నటించి మెప్పించారు . త్రిశూలం, బెబ్బులి, పులి బెబ్బులి, పలనాటి బ్రహ్మనాయుడు, విశ్వనాథ నాయకుడు, రంగూన్ రౌడీ, పులిబిడ్డ, ఉగ్రనరసింహం, ధర్మాత్ముడు, ధర్మతేజ చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. అనంతరం ఆయన కాలానికనుగుణంగా అనేక సహాయ పాత్రలు చేసి మెప్పించారు. ముఖ్యంగా కుర్రహీరోల చిత్రాల్లో అనేక మంచి పాత్రలు చేసి ప్రేక్షకుల మనస్సులను గెలుచుకున్నారు. అలాగే, నటవారసుడు ప్రభాస్‌తో కలిసి బిల్లా చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసు పాత్రతో మెప్పించిన ఆయన రుద్రమదేవి లాంటి భారీ చిత్రంలో గణపతి దేవుని పాత్రలో తనదైన నటనను ప్రదర్శించి ప్రేక్షక నీరాజనాలందుకున్నారు. ముఖ్యంగా 1970, 1980లలో కృష్ణంరాజు కెరీర్ ఓ రేంజ్‌లో సాగిపోయింది. అనంతరం ఆయన రాజకీయాలవైపు మొగ్గుచూపారు. ఈ క్రమంలో 1991లో మొదట కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే ఏడాది నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీచేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూపతిరాజు విజయకుమార్ రాజు చేతిలో ఓటమి పాలయ్యారు. దాంతో కొంత కాలం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయినా ఆయన వెనక్కు తగ్గలేదు. 1998లో రీ ఎంట్రీ ఇచ్చారు. భారతీయ జనతా పార్టీలో చేరి కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీచేసి విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టారు. అప్పటి ప్రధాని వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుతంలో మంత్రి పదవి దక్కించుకున్నారు. 2004 లోక్‌సభ ఎన్నికలలో మరోసారి నర్సాపురం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన కృష్ణంరాజు కాంగ్రెస్ అభ్యర్థి జోగయ్య చేతిలో ఓడిపోయారు. కొంతకాలం సైలెంట్ గా ఉన్న ఆయన మెగా స్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో 2009లో చేరారు. రాజమండ్రి నుంచి టికెట్ దక్కడంతో లోక్‌సభకు పోటీ చేశారు. కానీ ఆ ఎన్నికల్లో ఓటమి చెందడం, అనంతరం ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడంతో కృష్ణంరాజు పాలిటిక్స్‌కు దూరంగా ఉంటూ వచ్చారు. 2014లో మళ్లీ కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. నటునిగా జనాలను మెప్పించి ఒప్పించిన ఆయన అనేక అవార్డులు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977లో అమరదీపం చిత్రానికి, 1984లో బొబ్బిలి బ్రహ్మన్న చిత్రంలో ఆయన ప్రదర్శించిన నట విశ్వరూపానికి నంది అవార్డులతో సత్కరించింది. 1986లో తాండ్రపాపారాయుడు చిత్రానికి ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్న కృష్ణంరాజు.. 2006లో ఫిల్మ్‌ఫేర్ దక్షిణాది జీవితసాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. కృష్ణంరాజు రెండు పెళ్లిళ్లు చేసుకున్న విషయం తెలిసిందే. మొదట ఆయనకు సీతాదేవితో వివాహం జరిగింది. పెద్దలు కుదిర్చిన పెళ్లి. వీరికి పిల్లలు లేరు. ఓ కూతురుని దత్తత తీసుకున్నారు. అయితే 1995లో సీతాదేవి కారు ప్రమాదంలో కన్నుమూశారు. ఒంటరివాడైన కృష్ణంరాజుకి ఏడాది తర్వాత 1996 సెప్టెంబర్ 20న శ్యామలాదేవితో రెండో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలున్నారు. కృష్ణంరాజు సోదరుడు ఉప్పలపాటి సూర్యనారాయణ రాజు . సూర్యనారాయణ రాజుకి ఇద్దరు సంతానం. వీరిలో ప్రభాస్ పెద్దవాడు కాగా, మరో హీరో సిద్ధార్థ్ రాజ్ కుమార్ చిన్నవాడు. ఆయన కెరటం చిత్రంలో హీరోగా నటించిన విషయం తెలిసిందే. ప్రమోద్ -యూవీ క్రియేషన్స్ స్థాపించి నిర్మాతగా రాణిస్తున్నారు.ఇక ప్రభాస్ పెళ్లి కోసం కృష్ణంరాజు పరితపించారు. ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. అలాగే, కృష్ణంరాజు ముగ్గురు కూతుళ్లకు కూడా పెళ్లి కాలేదు. ఇలా తన పిల్లలకు తాను బతికుండగానే పెళ్లిళ్ళు చేద్దామన్న ఆయన కోరిక నెరవేరకుండానే హైదరాబాద్ లోని ఏఐజీ ఆస్పత్రిలో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆదివారం(2022, సెప్టెంబర్ 11న) తెల్లవారుజామున 3.25 నిమిషాలకు తుది శ్వాస విడిచారు. కృష్ణంరాజు మరణంతో తెలుగు చిత్ర సీమ ఓ మంచి నటుడ్ని కోల్పోయింది.. ఆయన లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిది.

దాసరి దుర్గా ప్రసాద్

# నాగసాధువులు అష్టసిద్ధులు కలిగి ఉంటారా?



అమో ఘమైన, అద్భుతమైన దివ్యశక్తులు, యోగశక్తులు కలవారు నాగసాధువులు!!అఘోరేభ్యోథఘోరేభ్యోఘోరఘోరథరేభ్య సర్వేభ్యోస్సర్వశర్వేభ్యోనమస్తేఅస్తురుద్రరూపేభ్యః!! ప్రయాగరాజ కుంభమేళాలో షాహీస్నానం గావించిన సమస్త సాధుమండలికి సమస్త అఖాఢాల సాధువులకు అఘోరాసాధువులకు నాగసాధువులకు భక్తిహృదయపూర్వక పాదాభివందనాలు!!కుంభమేళా జరిగే ప్రదేశంలో ఒకేసారి లక్షలాది నాగసాధువులు ఎలా ప్రత్యక్షమవుతారు???నాగసాధువులకి ఎలాంటి శక్తులు కలిగి ఉంటారో ఒక్కసారి చూద్దాం!!హరిద్వార్ లోనూ, త్రివేణి సంగమం లోనూ, ఉజ్జయిని లోను, నాసిక్ లోను జరిగే కుంభమేళా లలో లక్షలాది మంది నాగసాధువులు రావటం మనం టీవీల్ల, పేపర్ లలో చూశాం. నాగ సాధువులు దిగంబరంగా వుంటారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఎక్కడో హిమాలయ గుహలలో, కొండల్లో, నదీ తీరాల్లో వుంటారు. మామూలు రోజుల్లో వారు ఎవరికీ కనిపించరు. హిమాలయాల నుంచి కుంభమేళా జరిగే ప్రదేశాలు కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో వుంటాయి. ఇక్కడ మనకు మనమే ఒక ప్రశ్న వేసుకుందాం. కొన్ని లక్షల మంది దిగంబరులు ఒకేసారి కొన్ని వందల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే, వాళ్ళు ప్రయాణం చేసిన మార్గం అంతా ట్రాఫిక్ జామ్ అవ్వాలి కదా. ఇప్పటి దాకా ఎక్కడైనా అలాంటి సంఘటన రికార్డ్ అయ్యిందా? ప్రయాణ మార్గంలో ఎన్నో పల్లెలు, పట్టణాలు, నగరాలు వుంటాయి. ఎక్కడైనా,ఏ ఫోటోగ్రాఫర్ కు అయినా ఇన్ని లక్షల మంది దిగంబరులు కన్పించారా? ఎక్కడైనా ఇంత మంది ప్రత్యేక విమానాల్లో, ఇతర రవాణా సాధనాల్లో ప్రయాణం చేసిన దాఖలాలు కన్పించాయా?లేదే? సరిగ్గా అందరూ ఒకే సారి, కుంభమేళా జరిగే ప్రదేశంలో ఎలా ప్రత్యక్ష మవుతారు? కుంభ మేలా ముగిశాక ,తిరుగు ప్రయాణంలో ఒక కిలోమీటర్ దూరం వరకే కన్పించి హటాత్తుగా ఎలా మాయమైపోతారు? ఆ ప్రాంతంలో తప్ప మరెక్కడా వారి జాడ ఎందుకు కన్పించదు? వీటన్నింటికీ సమాధానం ఒకటే!! వారు అణిమాది అష్టసిద్ధులు కలిగి ఉంటారు!! ఇప్పటికీ హిమాలయ ప్రాంతా లలో మహా మహిమాన్విత సిద్ధపురుషులు, యోగపురుషులు సూక్ష్మరూపాలలో సంచరిస్తూఉంటారని వారు మహాత్ములకే దర్శనమిస్తారు! వారికి తెలియని విద్యలు లేవు!!వారు దూది పింజలవలె తేలిక కాగలరు!!వారు పర్వతమంతా బరువు కాగల రు!!అనేక తాంత్రికవిద్యలలో సిద్ధహస్తులు!!1)అగ్నిస్థంభన, 2)వాయుస్థంభన, 3)జలస్థంభనవిద్యలతో పాటు, 4)కాయస్థం భన, 5)వాక్ స్థంభన 6)పరకాయప్రవేశ విద్యలు, 7)ఈశిత్వ, 8)వశిత్వ, 9)వశీకరణ విద్యలు, 10)దూరదర్శన, 11)దూరశ్రవ ణాదిఅనేకవిద్యలు వారికి కరతలామలకం!! ఎంతో అవసరమే ర్పడితే తప్ప వారు తమవిద్యలనుబహిర్గతపరచరు!చాలా రహ స్యంగా గోప్యంగా ఏమి తెలియనట్లుగ ఉంటారు!! అందులో సూక్ష్మశరీరయానం. ఒకభాగం!! నాగసాధువులు తమ సుదీర్ఘ ప్రయాణానికి ఉపయోగించే ప్రయాణ సాధనంఇదే!! మంత్రరహస్య గ్రంథాలున్నాయి !!అనేక శాస్త్రాలున్నాయి!! వేదాలు, ఉపనిషత్తులు పురాణ ఇతిహాసాలున్నాయి!!!ఒక్కసారి మనసు పెట్టి మన శాస్త్రాలను, పురాణ గ్రంథాలను చదవండి.!! వాటిని అధ్యయనం చేయండి!! సద్గురువులను ఆశ్రయించండి!!

సేనాధిపత్యం రమేష్

# జనవరి 20,1957 భారతదేశపు అణుశక్తి యుగంలో తొలి అడుగు



1957 భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం పొందింది. ఆ ఏడాది, భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి సాధిస్తూ, ప్రపంచ అణుశక్తి రంగంలో తన తొలి అడుగును పెట్టింది. ముంబై సమీపంలోని ట్రాంబేలో, అప్సర పేరుతో భారత దేశపు తొలి అణు రియాక్టర్‌ను ప్రారంభించడం ఈ ప్రయాణంలో అత్యంత కీలక ఘట్టంగా నిలిచింది.అప్సర రూపకల్పన, నిర్మాణంలో ప్రధానంగా భారత శాస్త్రవేత్తల కృషి ఉంది. అయితే, ఈ ప్రయత్నానికి బ్రిటన్ నుంచి కూడా సహకారం అందింది. ఇంధన సరఫరా: బ్రిటన్ నుండి అవసరమైన యురేనియం అందించ బడింది. సాంకేతిక సహాయం: కొన్ని మౌలిక సదుపాయాలకు మార్గదర్శకత అందించారు. అప్సరను ప్రధానంగా అణు శాస్త్రంలో పరిశోధన కోసం ఉపయోగించారు. ఇది భారత శాస్త్రవేత్తలకు న్యూట్రాన్ భౌతిక శాస్త్రం, రేడియేషన్ పై పరిశోధనలు చేయడానికి వేదికగా మారింది. మెడికల్ ఐసోటోప్స్ ఉత్పత్తి కోసం అప్సర ముఖ్యంగా ఉపయోగ పడింది. ఈ ఐసోటోప్స్ క్యాన్సర్ చికిత్స మరియు వైద్య పరీక్షలలో కీలక పాత్ర పోషించాయి. శాస్త్రవేత్తల శిక్షణ కోసం అప్సర ఒక జీవంత ప్రయోగశాలగా పనిచేసింది.అప్సర నిర్మాణం భారత శాస్త్రవేత్తల స్వదేశీ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. భారత ప్రభుత్వం 1954 జనవరి 3 న అణు పరిశోధన కోసం అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్ మెంట్, ట్రాంబే అనే సంస్థను స్థాపించింది. జహంగీర్ భాభా మరణించాక బాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ గా పేరు పెట్ట బడింది.డాక్టర్ హెూమీ జహంగీర్ భాభా, భారత అణుశక్తి రంగ పితామహుడు, దీనిని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు.1957లో అప్పటి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అప్సర పేరు పెట్టి,జాతికి అంకితం చేశారు. 1957లో అప్సర ప్రారంభం, భారతదేశాన్ని అణు శక్తి కలిగిన దేశాల జాబితాలో చేర్చింది. దీనిద్వారా, శాంతిమయ వినియోగాల కోసం అణుశక్తిని ఉపయోగించడానికి భారత దేశం ప్రామాణికంగా ఎదిగింది.భారతదేశం ఎప్పుడూ అణుశక్తిని శాంతి ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగిస్తామని ప్రపంచానికి స్పష్టం చేసింది. అప్సర దీనికి ప్రథమ ఉదాహరణ.2009లో, అప్సర పాత రూపాన్ని నిలిపివేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్సర-యూ పేరిట రియాక్టర్‌ను పునర్నిర్మాణం చేశారు. అప్సర-యూ ప్రత్యేకతలు: ఇది మరింత శక్తివంతమైనది, తక్కువ ఇంధన వినియోగంతో ఎక్కువ ప్రయోజనాలను అందించగలదు.1957లో మొదలైన ఈ ప్రయాణం, భారతదేశం పలు అణు రియాక్టర్ల నిర్మాణం వైపు దారితీసింది. ధ్రువ, కామిని, చంద్ర వంటి రియాక్టర్లు తదుపరి దశల్లో స్థాపించ బడ్డాయి.1957లో అప్సర రియాక్టర్ ప్రారంభం, భారతదేశ శాస్త్రసాంకేతిక రంగ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం. ఇది భారత దేశానికి అణు శక్తి స్వయం సమృద్ధి కల్పించి, ప్రపంచ స్థాయి పరిశోధనలో నడుపు పాత్ర పోషించేలా చేసింది. ఈ ప్రాజెక్ట్, శాస్త్రవేత్తల దీక్షకు,సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,

# నల్లగట్ల స్వామిదాస్‌ను కలిసిన తిరువూరు వైసిపి నాయకులు



**తిరువూరు జనవరి 19(ఆంధ్రపత్రిక)** అమెరికా పర్యటన దిగ్విజయంగా ముగించుకుని తిరువూరు పట్టణంలోని స్వగృహానికి చేరుకున్న వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాస్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులపై స్థానిక ప్రజా ప్రతినిధుల తో సమక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వై రామచంద్ర రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్లు తాళ్లూరి నవీన్ కుమార్, ముక్కామల సీతారామయ్య, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ భూక్యా రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**విజయవాడ జనవరి 19(ఆంధ్రపత్రిక)** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ ఆదివారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అహ్మద్ పాషా

## 150 మందికి కంటి వైద్య పరీక్షలు



**ఎ.కొండూరు జనవరి 19 (ఆంధ్రపత్రిక)** ఎ.కొండూరు మండలం చీమలపాడు మెయిన్ సెంటర్ లోని ఐవి. సుధాకర్ కాంప్లెక్స్ లో ముస్లిం మత గురువు ఎండి.మక్కి అష్రఫ్ ఖాదరీకి చెందిన అంత్రాలు, ఆయుర్వేద రెండవ షాపులో ఆదివారం 150 మందికి, విజయవాడ మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ అహ్మద్ పాషా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరీక్షల అనంతరం రోగులకు అవసరమైన కళ్ళజోళ్ళు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరతన్న దాత, నఖీబుల్ ఔలియా, సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ ఔలియా వారి (అల్లుడు) ఎండి. పర్వేజ్ అహ్మద్, కౌన్సిలర్ రాజేశ్వరి, కోఆర్డినేటర్ సత్య, పఠాన్ అస్లాం ఖాన్, ఎండి. గౌస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అమిత్ షాకు ఘన స్వాగతం పలికిన కూటమి కార్యకర్తలు



**ఆగిరిపల్లి, జనవరి 19 (ఆంధ్రపత్రిక)** ఎన్ డి ఆర్ ఎఫ్ 20వ వార్షికోత్సవం నకు మహా కూటమి ముఖ్య నాయకులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వార్షికోత్సవ సభలో పాల్గొనట సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నేతృత్వంలో ఆగిరిపల్లి, ఆగిరిపల్లి మండలంలోని పలు గ్రామాల నుండి తెలుగుదేశం, జనసేన, బిజెపి కార్యకర్తలు వందలాదిగా ఎన్ డి ఆర్ ఎఫ్ 20వ వార్షికోత్సవమునకు తరలి వెళ్లారు, ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా తమ అభిమాన నాయకులకు పుష్పములతో ఘన స్వాగతం పలికారు.

# వేములపల్లి సురేష్ దాతృత్వంతో ఒక వ్యక్తికి కంటి చూపు



**చల్లపల్లి, జనవరి 19( ఆంధ్ర పత్రిక)** ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ దాతృత్వంతో ఒక వ్యక్తికి కంటి చూపు లభించింది. పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన కాకాని గౌరీశంకర్ విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ల్యాబ్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. అతను కంటిలోని రేటినాను ప్రభావితం చేసి రాత్రి అంధత్వం బారిన పడి క్రమేపి పరిధి, రంగు కోల్పోయి కేంద్ర దృష్టిని కోల్పోయి అంధత్వం బారిన పడేసే రెటినిటిస్ పిగ్మెంటోసా అనే వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆర్థిక సహాయం కోసం మండల పరిధిలోని పురిటిగడ్డలో ఉన్న ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ – రోజా దంపతులను సంప్రదించి సహాయం కోరాడు. దీంతో అతనికి సురేష్ – రోజా దంపతులు తమ ఐవీఎం ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. తద్వారా గౌరీ శంకర్ ఆపరేషన్ విజయవంతంగా చేయించుకుని కోలుకుంటున్నాడు. తనకు సహాయం చేసిన ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ – రోజా దంపతులకు కృతజ్ఞతలు తెలిపాడు.

# మన తిరువూరు - మన కొలికపూడి

## ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేస్తా :ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

**తిరువూరు జనవరి 19(ఆంధ్రపత్రిక)**తిరువూరు పట్టణంలోని 17 వ వార్డ్ లో మన తిరువూరు – మన కొలికపూడి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం వార్డులో పర్యటిస్తూ వార్డులో వున్న సమస్యలను పరిశీలిస్తూ అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డు లో ఎక్కడెక్కడ రోడ్ లు,డ్రైనేజీ లు లేవు అని అందరిని అడుగుతూ వార్డులో మంచినీటి సరఫరా జరుగుతుందా లేదా సమస్యలు ఏమేం వున్నాయో అని వార్డు ప్రజలను అడుగుతూ కార్యక్రమాన్ని కొనసాగించారు. కొంత మంది ప్రజలు త్రాగు నీటి సమస్య ,సీసీ రోడ్డు లు నిర్మించాలి డ్రైనేజీ వ్యవస్థ అసలు లేదు డ్రైనేజీ లు నిర్మించాలి అని వినతి పత్రాలు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు అందజేశారు. అందరి దగ్గర నుంచి వస్తున్న వినతులు వింటూ సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ముందుగా రోడ్ల మీద వున్న చెట్లు తొలగించి, డ్రైనేజీలను బాగు చెయ్యాలని సంబంధిత శాఖా ధికారులకు ఎమ్మెల్యే కొలికపూడి



శ్రీనివాసరావుసూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీలలో

# కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ



బంటుమిల్లి, జనవరి 19(ఆంధ్రపత్రిక) ఆదివారం నాడు ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కళాశాల మచిలీపట్నం నందు మచిలీపట్నం ఆర్ట్స్ అకాడమీ వారు నాలుగవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గల విద్యార్థులకు జాతీయ సమైక్యత అనే అంశంపై జిల్లా స్థాయి చిత్తూర్ లేఖన పోటీలను నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మచిలీపట్నం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి బిఎస్సి శేఖర్ సింగ్, మరియు గూడూరు మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జేవిఆర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శేఖర్ సింగ్ మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీలతో ఏకాగ్రత పెరుగుతుందిఅని అది విద్యార్థులు చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని చిత్రలేఖనం నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు సైన్స్ కు సంబంధించిన చిత్రాలను కూడా చాలా అవలీలగా గియ్యగలుగుతారని గెలుపు,ఓటముల గురించి ఆలోచించవద్దని పోటీలలో పాల్గొనడమే ఒక గెలుపు అని తెలియజేశారు. ఈ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో తరగతులు వారీగా బహుమతులు అందజేయడం జరిగింది. అందులో బంటుమిల్లి కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు నంబూరి గీతిక ప్రియా ఎనిమిదవ తరగతి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం అజ్మీర రఘురామ మహర్షి 8వ తరగతిలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించారు. అంతేకాకుండా కొమ్మారెడ్డి విద్యార్థులు తోట సాయి నాగ సుమంత్ (8వ తరగతి) ప్రత్తి మహిధర్(7వ తరగతి)లకు కన్సోలేషన్ బహుమతులను సర్టిఫికెట్లను అందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మచిలీపట్నం డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి బిఎస్సి శేఖర్ సింగ్ చేతులమీదుగా విజేతలకు బహుమతుల ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ఉపాధ్యక్షులు ప్రసాద్ మరియు సెక్రెటరీ బిఎస్సి రమేష్, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మరియు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె. ఎస్.వి.జి.శోభ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పలువురు తల్లిదండ్రులు అభినందించారు.

# దేశంలో కార్మిక కర్షక రైతుల వ్యతిరేక పాలన.... సిపిఎం నాయకులు

**బంటుమిల్లి, జనవరి 19(ఆంధ్రపత్రిక)** దేశవ్యాప్తంగా కార్మిక కర్షక మైత్రి దినోత్సవ కార్యక్రమాలు కు కార్మిక రైతు సంఘాలు పిలుపుమేరకు బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్లో మైత్రి సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకి రైతు సంఘం మండల కార్యదర్శి లంకదాసు అజయ్ గోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు బంటుమిల్లి మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో నియంత పరిపాలన సాగుతుందని రైతు చట్టాలు చేయాలని రైతులు నిరాహారదీక్ష చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం సోద్యం చూస్తుందని కోర్టులు చెప్పిన గాని పెడచెవులు పెట్టి పెట్టుబడిదారులకి అందులోనా ఆదాని, అంబానీలకు రెడ్ కార్పొరేట్లు పరిచి సేవ చేసుకుంటున్నాయని రాష్ట్రానికి అరకొర నిధులు కేటాయించి బాగా కేటాయించామని బాగా అభివృద్ధి చేస్తున్నా ము చెప్పుకుంటున్నాయని, పార్లమెంట్ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఇంతవరకు రాష్ట్రంలోని తెలుగుదేశం జనసేన ప్రభుత్వాలు నోరు మెదపలేదని అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు క్షమాపణ చెప్పేవరకు వదిలేది లేదని ఆయన అన్నారు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గతంలో రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చిందని వాటి కోసం దాదాపుగా 13 నెలలు పోరాటం చేసి 750 మందిని ప్రాణాలు అర్పించారని ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకమైన హామీలు ఇచ్చిందని అందులోనే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేస్తామని అన్నారని కానీ ఇంతవరకు చేసింది లేదని రైతుల



కోసం అక్కడ జరుగుతున్న నిరాహారదీక్ష కు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని రైతులకు కార్మికులకు న్యాయం జరిగేంత వరకు ఈ కార్మికకర్షిక ఐక్యత పోరాటాలు కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుజ్ఞానం జనార్దన్ రావు అబ్బూరి కిరణ్ నీలిపూడి రంగారావు సిఐటియు నాయకులు వంగల రాజు ఆకునూరి వెంకటేశ్వరరావు చొప్ప బాజీ జువాది వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగిశెట్టి కృష్ణ పొదిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సిదార్థ్ ఆసుపత్రులు మరియు వెల్కిన్స్ భాగస్వామ్యంతో నూతన క్యాథ్ ల్యాబ్ ప్రారంభం

అత్యున్నత వైద్య సేవలు అందించే కృషిలో ఒక కీలక ముందడుగు
ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు గారికి వివరిస్తున్న డాక్టర్ల బృందం



హైదరాబాదు,**జనవరి 19(ఆంధ్రపత్రిక)** సిదార్థ్ ఆసుపత్రులు మరియు వెల్కిన్స్ సంస్థల భాగస్వామ్యంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన క్యాథ్ ల్యాబ్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నగరంలోని మియాపూర్ మదీనాగూడా లో ప్రారంభించారు. ఈ సదుపాయం ద్వారా కార్డియాక్ మరియు న్యూరోవాస్కులర్ ప్రొసీజర్‌లను అత్యున్నత నిపుణుల పర్యవేక్షణలో అత్యాధునిక యంత్రాలతో చేయనున్నారు.

ఈ కార్యక్రమానికి సిదార్థ్ ఆసుపత్రుల డైరెక్టర్, ప్రముఖ న్యూరోఫిజిషియన్ డాక్టర్ టి. సిదార్థ్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆసుపత్రి సీఈఓ డాక్టర్ లంకలపల్లి వెంకటేశ్ నాయుడు గారు, వెల్కిన్స్ సంస్థ ప్రొమోటర్ పేరుమాల్ కన్నన్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ నాగూర్ (ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్) మరియు డాక్టర్ వేణు (మెడికల్ కార్డియాలజిస్ట్) వంటి ప్రముఖ వైద్య నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అమూల్యమైన సూచనలు ఇచ్చారు. వారి కలయికతో ఈ కొత్త క్యాథ్ ల్యాబ్ మరింత అభివృద్ధి చెందుతుందని నమ్మకం వ్యక్తం చేశారు. ఈ క్యాథ్ ల్యాబ్‌లో హార్ట్ స్టెంటింగ్, బ్యాలూన్ ఆంజియోప్లాస్టీ, ఎలక్ట్రోఫిజియాలజీ పరీక్షలు, సైతం న్యూరోవాస్కులర్ యాంటిగ్రామ్ మరియు థెరప్యూటిక్ ప్రొసీజర్‌లు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని అత్యాధునిక యంత్రాలు, నిపుణుల మద్దతు ద్వారా అత్యంత క్లిష్టమైన కేసుల్ని సైతం విజయవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ సీఈఓ డాక్టర్ వెంకటేశ్ నాయుడు గారు చెప్పారు. సమావేశంలో డాక్టర్ సిదార్థ్ రెడ్డి గారు మాట్లాడుతూ, “ఈ క్యాథ్ ల్యాబ్ ప్రారంభం ద్వారా మేము కార్డియాక్ మరియు న్యూరోలాజికల్ ఎమర్జెన్సీలను వేగవంతంగా, ఖచ్చితంగా, సురక్షితంగా నిర్వహించగల సామర్థ్యాన్ని పెంచుకున్నాం. ఇది సమీప ప్రాంతాల ప్రజలకు అత్యున్నత వైద్య సేవలను అందించే కృషిలో ఒక కీలక ముందడుగు” అని అన్నారు. అలాగే, వెల్కిన్స్ ప్రొమోటర్ పేరుమాల్ కన్నన్ గారు మాట్లాడుతూ, “అత్యాధునిక సాంకేతికత మరియు వైద్య నిపుణుల మద్దతుతో ఈ క్యాథ్ ల్యాబ్ రోగులకు విశ్వసనీయమైన సేవలను అందించడంలో ముందంజ వేస్తుంది. ఈ ప్రాజెక్ట్‌ను భాగస్వామ్యం చేయడం మా సంస్థకు గౌరవంగా ఉందని పేరుమాళ్ కన్నన్ తెలిపారు. ఈ క్యాథ్ ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు వైద్య నిపుణులు, సమాజ ప్రముఖులు పాల్గొన్నారు. ఇది కేవలం నగరానికి మాత్రమే కాకుండా పక్క నగరాలకు కూడా అత్యున్నత వైద్య సేవలను అందించడానికి అవసరమైన ఒక కేంద్రంగా నిలుస్తుందని నిపుణులు పేర్కొన్నారు. కార్డియాక్ మరియూ న్యూరోవాస్కులర్ ప్రొసీజర్లను గురించి డాక్టర్ల బృందం ఆధ్యాత్మిక , సామాజిక సేవకులు శ్రీ ఎస్. ఎస్.ఆర్. ఆంజనేయులు గారికి వివరించారు. సిదార్థ్ ఆసుపత్రులు నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ఈ అత్యాధునిక క్యాథ్ ల్యాబ్, రోగుల ప్రాణాలను రక్షించడంలో సాంకేతికంగా కొత్త ప్రాచుర్యం పొందుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు



**ఆగిరిపల్లి, జనవరి 19 (ఆంధ్ర పత్రిక)** ఆగిరిపల్లి మండలం నుగుండపల్లి గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుల శ్రీనివాసరావు తల్లి కందుల మాణిక్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను మరియు శోభనాపురం గ్రామం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్కరబోయిన సాంబశివరావు తల్లి నక్కనబోయిన రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఇరు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి జడ్పిటిసి వీరబాబు, ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ ఉపాధ్యక్షులు పల్లగాని నరసింహారావు, వైఎస్ఆర్సిపి ఆగిరిపల్లి మండల పార్టీ అధ్యక్షులు బెజవాడ రాంబాబు, బెజవాడ హర్ష, గ్రామ సర్పంచ్ కందుల మల్లేశ్వరి విక్రం, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆహారం వృథా ను అరికట్టడానికి స్విగ్గీ, ఆర్ హెచ్ ఏ భాగస్వామ్యం

**విజయవాడ,జనవరి 19 (ఆంధ్రపత్రిక)** భారతదేశ అగ్రగామి ఆన్ డిమాండ్ సౌకర్యాల వేదిక స్విగ్గీ ఆహార పదార్థాలు వృధాను తగ్గించే లక్ష్యంతోస్విగ్గీ సర్వ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మేరకు ఈ ప్రచారంలో భాగంగా స్విగ్గీ ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రాబిన్ హుడ్ ఆర్మీ (ఆర్ హెచ్ ఏ) తో ఒక ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా స్విగ్గీ మార్కెట్ ప్లేస్ విభాగ హెడ్ రోహిత్ కపూర్, ఆర్ హెచ్ ఏ వ్యవస్థాపకులు నీల్ ఘోష్ మాట్లాడుతూ ఆహారం వృధాగా పోవడం తగ్గించడం, ఆ సమస్య పరిష్కరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉందన్నారు. ఈ భాగస్వామ్యంలో ఆర్ హెచ్ ఏ, స్విగ్గీ కలసి రెస్టారెంట్ భాగస్వాముల నుండి తక్కువ సేవలందించే కమ్యూనిటీలకు మిగులు ఆహారాన్ని పునఃపంపిణీ చేయడం ద్వారా అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. ఈ సహకారం ద్వారా, రెండు సంస్థలు 2030 నాటికి 50 మిలియన్ల భోజనాలను అందించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయన్నారు. ఆహార పునఃపంపిణీని పునర్నిర్మిం చడానికి సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారాస్విగ్గీ సర్వ్ ఆర్ హెచ్ ఏ భాగస్వామ్యం యొక్క పైలట్ దశ ఇప్పటికే ప్రోత్సాహకరమైన ఫలితాలను అందించిందన్నారు. 33 నగరాల్లో 2,000 కంటే ఎక్కువ భోజనాలు పునఃపంపిణీ చేయబడ్డాయని, 126 కంటే ఎక్కువ రెస్టారెంట్ భాగస్వాములు ఈ చొరవలో చేరారని చెప్పారు.

# తమ మొదటి ఎలక్ట్రిక్ ఎస్యూవీ ఈవిటారాను విడుదల చేసిన మారుతి సుజుకీ

**విజయవాడ:,జనవరి 19 (ఆంధ్రపత్రిక)** మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తమ మొదటి బి–ఈవీ (బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్)– ఎస్యూవీ ఈవిటారాను సమగ్రమైన ‘ఈ ఫర్ మీ’ ఎలక్ట్రిక్ పర్యావరణ పరిష్కారాలతో పాటు భారత్ మొబిలిటి గ్లోబల్ ఎక్స్ పో 2025ను ప్రారంభిం చింది.



హియర్టెక్ట్–ఈ ప్లాట్ఫాంపై నిర్మితమైన, ఈవిటారా గొప్ప సామర్థ్యాన్ని, అమోఘమైన శ్రేణిని సాటిలేని సౌకర్యం, భద్రతతో అందిస్తోంది. ప్రీమియం నెక్సా ఛానల్లో పరిచయం చేయబడటానికి సిద్ధంగా ఉన్న ఈవిటారా నెక్సా కీలకమైన విలువైన వినూత్నత, ఆధునికత, ప్రీమియం కస్టమర్ అనుభవానికి చిహ్నంగా నిలిచింది.

# యోగి వేమన రచనలు నైతిక విలువలకు పునాదులు.



**విజయవాడ:,జనవరి 19 (ఆంధ్రపత్రిక)** జ్ఞానవంతమైన సమాజం కోసం ప్రతి వ్యక్తి ఆచరించాల్సిన నైతిక విలువలను వెయ్యేళ్ళ క్రితమే ప్రజా కవి వేమన తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరం లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి వ్యక్తి ఎలా జీవించాలి అనే అంశాలపై ఎన్నో వచన కవిత్వాలు, పద్యాలు యోగి వేమన రచించారన్నారు. ఆయన పద్యాలలో “విశ్వదాభిరామ వినురవేమ” అని వాక్యాన్ని తెలియని తెలుగువారు లేరన్నారు. యోగి వేమన తర్వాత తరంలో తెలుగు గడ్డపై జన్మించిన ఎంతోమంది కవులకు యోగివేమన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఒక కవి అంతిమ లక్ష్యం సమ సమాజ స్థాపనే అనే అంశాన్ని 1000 సంవత్సరాల క్రితమే ఆయన ప్రబోధించారన్నారు. నేటి తరం కవులు, రచయితలు కూడా యోగివేమన ఆశించిన జ్ఞానవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా రచనలు చేయాలని సూచించారు. ప్రధానంగా నేటితరం విద్యార్థిని విద్యార్థులు యోగివేమన రచించిన వేల పద్యాలను కంఠస్థం చేయడం ద్వారా తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. కుల మతాలకు అతీతమైన వేమన భావజాలాన్ని నేటి తరం పౌరులు తెలుసుకోవడం ద్వారా ప్రజా కవి యోగివేమన రచించిన పద్యాలకు సార్థకత చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి నరసింహం డిఆర్ డిఏప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# “విద్యా వికాస్” పబ్లిక్ స్కూల్ 2010 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక





గుడివాడ,జనవరి 19: **(ఆంధ్రపత్రిక)** విద్యా వికాస్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్, 2010 బ్యాచ్ విద్యార్థులు జనవరి 18,శనివారం పాఠశాల ప్రాంగణంలో ఒక గొప్ప పునఃకలయికను నిర్వహించడంతో జ్ఞాపకాలు మరియు ఆనందంతో విద్యా వికాస్ ప్రాంగణం ఆత్మీయంగా మారింది. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థులు పాసయి 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగింది, మరియు ఇది మాజీ సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు తిరిగి కలుసుకోవడానికి మరియు వారి ఉమ్మడి జ్ఞాపకాలను జరుపుకోవడానికి అవకాశాన్ని కల్పించింది. పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఆత్మీయ సమావేశం కు హాజరైన వారికి హృదయపూర్వక స్వాగతంతో ప్రారంభమైన బాగా ప్రణాళిక చేయబడిన సందర్భం, విద్యార్థుల జీవితాలకు వారు చేసిన అమూల్యమైన కృషికి గుర్తింపుగా ఈ కార్యక్రమంలో తమ “బిగ్ సర్” ఏం.సుబ్బారావు,ఆత్మీయ “చిన్న సర్” కె.సాంబశివ రావు లను సత్కరించారు. పూర్వ విద్యార్థులు హృదయపూర్వక తమ అనుభవాలను, తమ విశేషాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం, ఇంటరాక్టివ్ సెషన్‌లు మరియు పాఠశాల ప్రాంగణంలో జ్ఞాపకాల పర్యటన వంటి కార్యకలాపాల సమ్మేళనం జరిగింది. హాజరైనవారు తరగతి గదులు, క్రీడా మైదానాలు మరియు వారికి ముఖ్యమైన అర్థాన్నిచ్చే ఇతర సుపరిచితమైన ప్రదేశాలను తిరిగి సందర్శించడం ద్వారా వారి ప్రియమైన జ్ఞాపకాలను తిరిగి పొందారు. ఈ పునఃకలయికలో ముఖ్యాంశం ప్రిన్సిపాల్స్ మరియు ఉపాధ్యాయులను సత్కరించడం మరియు ప్రత్యేక భోజనం ఏర్పాటు చేయడం, ఇది స్నేహాన్ని పెంపొందించడం మరియు పూర్వ విద్యార్థులు పంచుకున్న కథలు మరియు నవ్వుల ద్వారా బంధం ఏర్పరచుకోవడానికి ఒక స్థలాన్ని సృష్టించడం. ఈ కార్యక్రమం గ్రూప్ ఫోటో మరియు భవిష్యత్తులో ఇలాంటి సమావేశాల ద్వారా సంబంధాలను సజీవంగా ఉంచుతామని హామీ ఇవ్వడంతో ముగిసింది. 2010 బ్యాచ్ పాఠశాల యాజమాన్యం పెద్ద సార్,చిన్న సర్ మరియు ఉపాధ్యాయుల నిరంతర మద్దతు మరియు వారి ప్రయాణంలో భాగమైనందుకు వారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ

# భక్తులతో కళకళలాడిన శ్రీశ్రీశ్రీ బండి ముత్యాలమ్మ వారు



**మొగల్తూరు జనవరి 19 (ఆంధ్రపత్రిక)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయమునకు ఆదివారం ఉదయం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయ ప్రాంగణం అంతా దూర ప్రాంత భక్తులతో కళకళలాడింది. ఆలయ ఇంచార్జి కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు సిబ్బంది అరటి పళ్ళు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

# మొగల్తూరులో ఘనంగా ముగిసిన శ్రీ నడివీధి ముత్యాలమ్మ జాతర



**మొగల్తూరు,జనవరి19(ఆంధ్రపత్రిక)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామములోగ్రామ ప్రజల ఆరాధ్యదేవత శ్రీ నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా సంక్రాంతి పండుగ సమయంలో ఈ అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. గ్రామానికి చెందిన గురుజు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జాతరను నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన భక్తులు సుదూర ప్రాంతాలల్లో ఉన్నవారు గ్రామానికి చెందిన ఆడపడుచులు ప్రత్యేకంగా వచ్చి అమ్మవా రికి మొక్కుబడులు చెల్లించారు. జాతర సందర్భంగా బుట్టబొమ్మల నృత్యాలు, అసాధుల నృత్య ప్రదర్శన, గరగ నృ త్యాలు, కోలాట భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మొగల్తూరులో గ్రామ దేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా రహదారిపై వెళ్లే వాహనాల ట్రాఫిక్ ను పక్కనుండి మళ్ళించారు.

# పేరుపాలెం హైస్కూల్లో పూర్వపు విద్యార్థులు కలయిక



**మొగల్తూరు జనవరి 19 (ఆంధ్రపత్రిక)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామంలో కొమ్మూరి సతీష్ మెమోరియల్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఆదివారం ఉదయం పాఠశాలలో 2011-12 సంవత్సరంలో చదువుకున్న పదోవ తరగతి పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. 13 సంవత్సరాల క్రితం పాఠశాలలో చదువు నేర్పిన అప్పటి గురు ఉపాధ్యాయులు పెద్దిరాజు మరియు రీటలను పూర్వ విద్యార్థులు శాలువా కప్పి పూలదండలతో ఘనంగా సత్కరించే పాదాభివందనం చేశారు. పాఠశాలలో 13 సంవత్సరాల క్రితం చదువుకున్న కాలంలో జరిగిన పలు సంఘటనలను పూర్వ విద్యార్థులు అందరూ కలిసి ఒకరిని ఒకరు నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఎంతో ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తరపున తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు 58 మంది బ్యాచ్ ఉండగా వానిలో 36 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరైనట్లు నిర్వాహకులు ఆకిశెట్టి సత్తిబాబు, కొప్పునేని వంశీ, తిరుమల సుబ్బు, కొప్పునేని రామకృష్ణ, మోకా లీలా కృష్ణ, కొప్పునేని రేణుక దేవి తదితరులు ఆదివారం మా "ఆంధ్రపత్రిక ప్రతినిధి"కి తెలిపారు.

# రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే సుందరపు



**అచ్యుతాపురం, జనవరి 19, (ఆంధ్రపత్రిక)** విశాఖ నగరంలోని ఆదివారం మధుర ఇన్ హెరీటల్ లో జరిగిన ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలకు చెందిన క్రీడా అసోసియేషన్ లు పాల్గొన్నాయి. ఈ యొక్క ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎలమంచిలి ఎమ్మెల్యే శ్రీ సుందరపు విజయ కుమార్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ ను, విశాఖపట్నం సభ్యులు ఎమ్మెల్యే గణబాబు, ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శి కంచరణ సూర్యనారాయణ, కోశాధికారి మోహన్ మరియు హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోపి మరియు ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అబ్జర్వర్ విష్ణు, సాప్ అబ్జర్వర్ జూన్ గాలియత్, ఏపీ ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ మోహన్ వెంకట్రావు, మరియు ఎలక్షన్ ఆఫీసర్ అడ్వకేట్ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన మల్ల వారి

# వనభోజనాల ఆత్మీయ కలయిక





**అనకాపల్లి జనవరి 19 (ఆంధ్రపత్రిక)** యల్లమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామంలో వెలసి ఉన్న పారిపల్లి అమ్మవారి గుడి వద్ద మళ్ళ వారి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక వనభోజనాలు కార్యక్ర ము. ఆదివారం జరిగింది ముఖ్య అతిధులుగా రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర , డాక్టర్ మల్ల బెనర్జీ , ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ముందుగా పారిపల్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తదుపరి జరిగిన సమావేశం లో పెద్దలందరూ మాట్లాడుతూ మల్ల సురేంద్ర తెలుగుదేశం పార్టీ లో 30 ఏళ్ళు నుండి అధికారం వున్న లేకపోయినా పార్టీ కి ఎంతో విధేయుడు గా ఉంటూ, కమిట్ మెంట్ వున్న వ్యక్తి గా రాజకీయాల్లో కష్టానికి తగ్గ ఫలితం పొంది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు. ఆశిసులు తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా పెద్దలందరూ అభినందిచి, సత్కరించారు. అనంతరం వేద్య వృత్తి లో ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న డాక్టర్ బెనర్జీ అభినందించి సత్కరించడం జరిగింది. మల్ల శేషు మల్ల నరసింగరావు అధ్యక్షతన జరిగిన మల్ల వారి ఆత్మీయ కలయిక వనభోజనాలు. కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి, మాజీ జడ్పిటిసి మల్ల సంజీవరావు హైదరాబాద్ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు మల్ల సన్యాసిరావు మల్ల మల్ల భాస్కరరావు మల్ల నాగేశ్వరరావు మల్ల జగ్గప్పారావు మల్ల రాము జగన్నాధ రావు వండర్ వరల్డ్ కిడ్స్ స్కూల్ అధినేత మల్ల రామనాయుడు మళ్ల వరాహ నర్సింగరావు, కన్నం నాయుడు, రాము నాయుడు, రాము, అప్పారావు, అధిక స్థాయిలో మళ్ళ వారి కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది

# సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా..!




**వి.ఆర్.పురంజనవరి 19 (ఆంధ్రపత్రిక) .** వి. ఆర్. పురం మండలం రేఖపల్లి సెంటర్ లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షాకు రాష్ట్ర పర్యటన సందర్భంగా పార్లమెంటులో అంబేద్కర్ వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా నిర్వహించారు.గో.. బ్యాక్ కేంద్ర మంత్రి అమితాషా అని నినాదాలు చేశారు.మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంమంత్రి మన రాష్ట్రానికి వస్తున్న అమిత్ షాను వెంటనే తిరిగి వెళ్లాలని డిమాండ్ చేశారు.. రేఖ పల్లి జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి అమిత్ షాను గో బ్యాక్ గో బ్యాక్ అంటూ వినాదాలు చేశారు . ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం. రాజులు, జిల్లా నాయకులు సోయం. చిన్నబాబు, మండల కార్యదర్శి పులి. సంతోష్ కుమార్, మాట్లాడు తూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ను అమిత్ షా అహంకారపూరిత, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమ యంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు... కోట్ల మంది ప్రజల మనోభావాలను కించ పర్చేలా అమిత్‌షా వాఖ్యలు చేశారన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ హక్కులతో గద్దెనెక్కిన మోడీ అమిత్‌షా వ్యాఖ్యల విషయంలో మౌనం వహించడం సిగ్గు చేటన్నారు. అంబేద్కర్ ఒక కులానికో మతానికో సంబంధించిన వ్యక్తి కాదని, దేశ ప్రజలందరూ సమానత్వంతో సామాన హక్కులు కలిగి ఉండాలని రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం అన్నారు. మన రాష్ట్రానికి వస్తున్న అమిత్ షాను తక్షణమే తిరిగి వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వడ్లాది రమేష్, హజరత్, కే కాంతారావు, కే సత్యనారాయణ, తాతబాబు, పాండురాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# కొండపల్లి హిల్ ట్రెక్కింగ్‌లో చురుకుగా పాల్గొన్న కేడెట్లు, ఆహ్లాదకరమైన అనుభవం

**గుంటూరు : జనవరి 19(ఆంధ్రపత్రిక)** ఏపీ ట్రెక్ %×××% భాగంగా, కేడెట్లు కొండపల్లి హిల్స్‌లో సాహసంతో కూడిన 8 కిలోమీటర్ల ట్రెక్కింగ్‌లో చురుకుగా పాల్గొన్నారు. ఈ ట్రెక్కింగ్ ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం కలిగించడమే కాకుండా, శారీరక సామర్థ్యం మరియు జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందించేందుకు సహాయపడింది. అనంతరం, కేడెట్లు కొండపల్లి మ్యూజియంను సందర్శించి, ఈ ప్రాంతం యొక్క చారిత్రక మరియు సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకున్నారు. అలాగే, ప్రసిద్ధ కొండపల్లి బొమ్మల దుకాణాలను సందర్శించి, ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన చెక్క బొమ్మల కళాకృతుల ప్రాముఖ్యతను గుర్తించారు. ఈ కార్యక్రమం శారీరక శ్రమతో పాటు సాంస్కృతిక అవగాహనకు కొత్త దారులను తెరిచింది, కేడెట్లను ప్రేరణతో నింపింది. క్యాంపు కమాండర్ కర్నల్ ఏస్.ఎం. చంద్రశేఖర్, డిప్యూటీ క్యాంపు కామండెంట్ లెఫ్టినెంట్ కర్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ మేజర్ అవినాశి పట్వాల్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, ఎస్ ఎం ఇమాం సాహెబ్ షేక్, లలిత బెల్లంకొండ, తదితరులు క్యాంపు తీరు తేన్నులను పర్యవేక్షణ చేసారు.



# విద్యతోనే విజ్ఞానంతో పాటు విజయాలు సొంతం: ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

## స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పంపిణీకి సిద్ధంగా యస్‌యస్‌సి న్యూ మోడల్ టెస్ట్ పేపర్ - 2025. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్, పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి.



**గుంటూరు : జనవరి 19(ఆంధ్రపత్రిక)** ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువొక్కటే" అన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలు అక్షర సత్యాలని శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. అందుకే, "తల దించుకుని నన్ను చదువు - తల ఎత్తుకునేలా నిన్ను చేస్తా" అని పుస్తకాలు ఎళ్ళవేళలా విద్యార్థులను ప్రేరేపిస్తూ ఉంటాయని ఆయన తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అత్యంత ఉపయుక్తమైన యస్‌యస్‌సి న్యూ మోడల్ టెస్ట్ పేపర్ - 2025 పుస్తకాన్ని ఉచితంగా అందజేయాలన్న సంకల్పంతో అందుకోసం ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో దీనికి సంబంధించిన పోస్టర్లను విద్యారంగ ప్రముఖులు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, "విద్యతో కేవలం విజ్ఞానం మాత్రమే కాదు, అద్భుతమైన విజయాలు సాధించవచ్చు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నిర్దేశించుకోవచ్చు. వారితో పాటు వారి కుటుంబ స్థితిగతులను మెరుగుపరుచుకోవచ్చు. విద్యార్థుల గౌరవాన్ని నిలబెట్టి, వారికి తగిన గుర్తింపును తెచ్చిపెట్టి, వారి జీవిత పయనంలో చక్కని మార్గదర్శిగా నిలిచేది ఒక్క చదువు మాత్రమే." అని వ్యాఖ్యానించారు. అందుకే చదువు లేనిదే భవిత లేదన్న వాస్తవాన్ని తెలుసుకుని ఎన్ని ఆటంకాలు ఎదురైనా కష్టపడి - ఇష్టపడి చదువును కొనసాగించాలని ఆయన విద్యార్థులను కోరారు. ఎందుకంటే, "ఎవరి తలరాతనైనా మార్చే శక్తి గల విద్యే విద్యార్థులకు నిజమైన ఆస్తి" అని ఆయన తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు. అంతటి విలువైన విద్యను కేవలం పేదరికం వలన పొందలేకపోతే అంతకన్నా దురదృష్టం మరొకటి లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా యస్‌యస్‌సి న్యూ మోడల్ టెస్ట్ పేపర్ - 2025 పుస్తకాన్ని వారికి ఉచితంగా అందజేయాలని నిర్ణయించినట్లు లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. దీనికి సంబంధించి పుస్తకం కావలసిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పుస్తకం కావలసిన విద్యార్థులు స్ఫూర్తి ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో దీని కోసం ప్రత్యేకంగా %ఫ్ట్రజూం://ంజూశీశీతీష్ట్రఎ-టశీబఅఎఫ్అశీఅ.శీతీస్త్ర% రూపొందించిన ఈ లింక్‌లోని యాప్‌లో తమ పూర్తి వివరాలు నమోదు చేసుకుంటే వారికి తామే స్వయంగా పుస్తకాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు. తమ ఈ చిరు ప్రయత్నం కొందరి జీవితాల్లో అయినా పేదరికపు చిమ్మ చీకట్లు తొలగించే జ్ఞాన జ్యోతులు వెలిగిస్తే తమకంతే చాలునని ఆయన ప్రకటించారు. దీన్నొక సదవకాశంగా మలచుకుని, బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పోలే ముత్యం, కంజుల సత్యనారాయణరెడ్డి, స్ఫూర్తి ఫౌండేషన్ కార్యదర్శి పి.ఎన్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# వైభవంగా మొదటిరోజు చుక్కమాంబ తీర్ధ మహోత్సవం

## అలరించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు.



**వేపాడ,జనవరి19(ఆంధ్రపత్రిక):**-మండలంలోని అరిగిపాలెం గ్రామంలో గ్రామ ఇలవేల్పు దేవత అయిన శ్రీ సుక్కమాంబ మొదటి రోజు తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.వేకువ జామున 5గంటల నుండి గ్రామంలోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు,కుంకాలతో ధూప,దీప నైవేద్యాలతో పూజలు జరిపి వారి మొక్కులను చెల్లించుకున్నారు.అనంతరం గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన విజయనగరం ట్రూపు వారిచే శ్రీ సాయి బుర్రకథ బృందం వారిచే బాలనాగమ్మ అనే కార్యక్రమం కడురమ్యంగా ప్రదర్శించారు.అలాగే రాత్రి 8 గంటలకు నిర్వహించిన విశాఖ నాగు ట్రూపు వారిచే ఏర్పాటుచేసిన డాన్స్ బేబీ డాన్స్ చూపరులనుఎంతగానో అలరించింది.అదేవిధంగా రెండవ రోజు సోమవారం 20వ తారీఖున సాయంత్రం 8గంటల నుంచి "రేలారే రేలా" దుమ్ము లేపు దంచుకొట్టు అనే కార్యక్రమం కడు రమ్యంగా ప్రదర్శించబడుతుందని ఈ కార్యక్రమాన్ని చుట్టుపక్కల గ్రామ ప్రజలు విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు, ప్రజలు కోరుతున్నారు

# పూర్వపు విద్యార్థుల కలయికతో సందడి వాతావరణం



**మునగపాక, జనవరి 19, (ఆంధ్రపత్రిక):**అనకాపల్లి జిల్లా మునగపాక మండలం లక్ష్మి నరసింహ ఆలయం వద్ద 2010బి2011 సంవత్సరానికి చెందిన మునగపాక జడ్పీహెచ్ స్కూల్ పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు గత స్మృతులను గుర్తుకు చేసుకుంటూ చాలా ఆనందంగా ఉత్సాహంగా గడిపారు. ఆంధ్రప్రదేశ్ నలుమూలల ఉద్యోగాల్లో స్థిరపడిన వారందరూ ఈ అపూర్వ కలయికకు హాజరవ్వడం చాలా సంతోషంగా ఉందని 2010బి2011 సంవత్సరానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు తెలిపారు. ఈ అపూర్వ కలయికలో జడ్పీహెచ్ స్కూల్ లో చదివిన కోయిలాడ లావణ్య, నళిని, కాండ్రేగుల మంజు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ విధానాలతో వైకాపా ఖాళీ ఖాయం



**అచ్యుతాపురం, జనవరి 19, ఆంధ్రపత్రిక:**ఎలమంచిలి నియోజకవర్గ రాంబిల్లి మండలంలో వెంకటాపురం జనసేన పార్టీ కార్యాలయంలో చోడపల్లి భాను వెంకట్ ఆధ్వర్యంలో చోడపల్లి గ్రామానికి వైకాపా చెందిన సర్పంచ్ భాను వెంకట్, వైస్ సర్పంచ్ గురునాథ్ మరియు వార్డ్ నెంబర్లు రాజు, రమణ, నాగేశ్వరరావు, వెంకట్, వెంకటేష్, నాగేశ్వరరావు మరియు30మంది నాయకులు జనసేన పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దెబ్బతీసినా జగన్, వైకాపా నాయకుల మాటతీరు మారలేదన్నారు. వైకాపా ఖాళీకావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన టిడిపి బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్.టి.ఆర్ వర్ధంతి



**అమలాపురం జనవరి 19 ఆంధ్ర పత్రిక** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి విశ్వ విఖ్యాత నట సార్వభౌమ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి సందర్భంగా బ్రాహ్మణ సంఘటన మరియు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు సమక్షంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.. ఈ శిబిరంలో సుమారు 68 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు పళ్ళు, పెన్ను ప్రశంసా పత్రము అందజేశారు.ఈ కార్యక్రమంలో సహకరించిన సహస్ర బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు , కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ గంటి హరీష్ మధుర్, వేమూరి ఆనంద సూర్య పిలుపుమేరకు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో %= దీ ా% అమలాపురం పార్లమెంట్ అధ్యక్షుడు %దీ ఎ ా% శర్మ, ఆకెళ్ళ నారాయణమూర్తి , గొర్తి పవన్ , బిందు మాధవరావు , సరిపెల్ల సుబ్బరాజు, కప్పగంతుల భానోజీరావు ,%చీ ఐ ూ% కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ త్యాగరాజ స్వామి వారి 178వ ఆరాధనోత్సవాలు



గుంటూరు : జనవరి 19(ఆంధ్రపత్రిక) శ్రీ సరస్వతి సంగీత విద్వత్ సభ ఆధ్వర్యంలో స్థానిక అరండల్ పేట శ్రీ మోహన రంగనాయక స్వామి వారి దేవస్థానంలో శ్రీ త్యాగరాజ స్వామి వారి 178వ ఆరాధనో త్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిపారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామచార్యులు, వనజ దంపతులు జ్యోతి ప్రజ్వలన గావించారు. పూజా కార్యక్రమాల తదుపరి విశ్వ సంకీర్తనాచార్యులు మాడభూషి నరసింహాచార్యులు "ఘనరాగ కృతుల పంచరత్న గోష్టి" గానము గావించారు. అనంతరం నరసింహచార్యులు, శిష్య, ప్రశిష్యుల బృందం "లఘు అఖండము" పేరుతో అత్యంత భక్తి శ్రద్ధలతో 12 గంటల పాటుసాగిన నిర్విరామంగా శ్రీ శ త్యాగరాజ స్వామి వారి కృతులు, కీర్తనలతో సంగీతార్చన గావించారు. పెరవలి నందకుమార్, ధూళిపాళ్ల శ్రీనివాస్, చావలి శ్రీనివాస్ వయోలిన్ సహకారం అందించగా, బీరకాయ సురేష్ బాబు, కే జగన్మోహిని, చావలి కృష్ణమోహన్లు మృదంగం సహకారం అందించారు. కార్యక్రమాన్ని గడియారం సువర్ణ విద్య, ఎం శారద, వామన్ కుమార్, దేవస్థానం ట్రస్ట్, దేశరాజు పట్టాభి రామచంద్ర మూర్తి పర్యవేక్షించారు.

# పేదింట్లో విరిసిన క్రీడా కుసుమం

రాష్ట్ర,జాతీయస్థాయి లాంగ్ జంప్ లో అవార్డుల పంట.
ప్రోత్సాహం కొరవడి ప్రతిభకు అడ్డంపడుతున్న పేదరికం.
గచ్చిబౌలీ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడా ఆణిముత్యం.
అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడమే లక్ష్యంగా నిరంతర కృషి.
దాతల సహకారం కోసం ఎదురు చూపులు.



**వేపాడ,జనవరి,19(ఆంధ్రపత్రిక):–** పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న నానుడి ఆమెకు సరిగ్గా సరిపోతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టినప్పటికీ ప్రత్యేక ప్రోత్సాహం ఎవరి నుండి లభించక పోయినప్పటికీ స్వయంకృషితో క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర,జాతీయ స్థాయిలో లాంగ్ జంప్ లో అవార్డుల పంట పండిస్తున్న క్రీడా కుసుమంనకు తగిన ప్రోత్సాహం లభిస్తే



అంతర్జాతీయ స్థాయిలో ఇండియాకు గుర్తింపు తేవడమే లక్ష్యంగా నిరంతర కృషి సాధన చేస్తోంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ శివారు కోటయ్యగరువు గ్రామానికి చెందిన గమ్మెల నీలన్న పైడమ్మ దంపతుల రెండవ కుమార్తె లక్ష్మి ప్రస్తుతం జిల్లా లోని గజపతి నగరంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో లాంగ్ జంప్ లో శిక్షణ పొందుతోంది.స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి వరకు చదివిన గమ్మెల లక్ష్మి 5వ తరగతి నుంచి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ వరకూ చదువుకుంది.8వ తరగతి నుంచి ఆటలపై ఆశక్తి కనబరిచిన లక్ష్మి అంచెలంచెలుగా 100మీటర్లు,లాంగ్ జంప్ లలో ప్రత్యేక ప్రతిభను కనబరుస్తూ వచ్చింది.ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు మరింత ప్రోత్సాహం అందించడంతో రాష్ట్ర జాతీయ స్థాయిలో తిరుపతి, విజయవాడ, ఏలూరు,విశాఖపట్నం,శ్రీకాకుళం పట్టణాల్లో జరిగిన స్టేట్,మరియు నేషనల్ మీట్ లలో పాల్గొని రాష్ట్ర,జాతీయ స్థాయిలో మంచి ప్రతిభా పాటవాలను కనబరిచింది.అలాగే బీహార్,అస్సాం, బెంగళూరు, ఒరిస్సా తమిళనాడు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ లో కూడా జతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న లక్ష్మి ఇప్పటి వరకు 32మెడల్స్,60 మెరిట్ సర్టిఫికెట్లు సాధించి పుట్టిన గ్రామానికి,జన్మనిచ్చిన తల్లి దండ్రులకు,చదివిన స్కూళ్లు, కాలేజీలకు పేరు ప్రఖ్యాతులు తీసుకు వచ్చిన లక్ష్మీకి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందిస్తే పౌష్టికాహారం తీసుకొని అవసరమైన క్రీడా కిట్లు కొనుక్కోవడానికి, విదేశాలకు వెళ్ళడానికి వీలు కలుగుతుంది. సెంటు భూమి కూడా లేకపోవడంతో లక్ష్మి తల్లిదండ్రులు 25మేకలను మేపుకుంటూ జీవన భారం మోయాల్సి రావడంతో కుమార్తెకు తగినవిదంగా ప్రోత్సహించలేక తీవ్ర సతమతమవుతున్నారు. జాతీయ స్థాయి క్రీడల్లో ఐదు సిల్వర్,నాలుగు స్వర్ణం సాధించడమే కాకుండా గచ్చి బౌలి స్టేడియంలో రోజుకు ఏడు గంటల పాటు కఠోర దీక్ష శ్రమతో సాధన చేస్తున్న లక్ష్మీకి దాతలు ముందుకువచ్చి సహకరిస్తే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తానని చెబుతున్న లక్ష్మికి మనందరం చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

# సేరేపాలెంలో ఘనంగా ముగిసిన అమ్మవార్ల జాతర మహోత్సవాలు



**మొగల్తూరు జనవరి 19 (ఆంధ్రపత్రిక)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం సేరేపాలెం గ్రామంలో గ్రామ దేవతలు శ్రీశ్రీశ్రీ మ–త్యాలమ్మ శ్రీ శ్రీ శ్రీ మహాలక్ష్మిమ, శ్రీశ్రీశ్రీ గోగులమ్మ, పోతురాజుల జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. సేరేపాలెం గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి తరలివచ్చి చనివిడి,పానకాలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు.ఆదివారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్న), కలవకోలను వీరస్వామి, పోలిశెట్టి శ్రీనివాస్, కొల్లాటి గోపికృష్ణ, తదితరులు అమ్మవారినిదర్శించుకున్నారుఅనంతరం గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో విజేతలకు రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్న) చేతుల మీదగా విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొప్పరు నీటి సంఘం అధ్యక్షులు కత్తుల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ తణుకుల మునీశ్వరరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు కొండేటి తాతాజీ, మొగల్తూరు మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు దూసనపూడి సత్యనారాయణ, కమిటీ సభ్యులు కత్తుల చిట్టిబాబు, దూసనపూడి అంజి, రంగిశెట్టి బండి ముత్యాలు, కొత్తపల్లి రామ్ శ్రీను, పోతినీడి ప్రసాద్, మమ్మీనీడి కనకరాజు, దూసనపూడి చిన్ని, కత్తుల సత్తిబాబు, కత్తుల విజయ్, కత్తుల నాయుడు, చెన్ను బాలాజీ, కత్తుల శ్రీరంగం, కత్తుల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. సేరేపాలెం గ్రామంలో అమ్మవార్ల జాతర్ల నిర్వహణకు భక్తుల వినోదం కోసం రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన సినీ ఆర్కెస్ట్రా ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించుకునేందుకు సహకరించిన మొగల్తూరు పోలీసు వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక "కృతజ్ఞతలు"తెలిపారు

# కోర్టులు, మీడియా బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలి

## ఏఐ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై న్యాయకోవిదులు విశ్లేషణ చేసుకోవాలి లిజ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో చర్చించిన సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు





**విశాఖపట్టణం, జనవరి 19 (ఆంధ్రపత్రిక):** కోర్టులు – మీడియా పరస్పర సహకారంతో, సమన్వయంతో పని చేయాల్సి ఉందని, జవాబుదారీ తనంతో కూడిన పనితీరును ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సుప్రీం కోర్టు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు పేర్కొన్నారు. జ్యుడీషియరీ అండ్ మీడియా అనే అంశంపై జరిగిన మేథోపరమైన చర్చలో పలు అంశాలపై వారి ఆలోచనలు పంచుకున్నారు. ట్రయిల్ కోర్టులో, ఇతర న్యాయపరమైన అంశాల్లో మీడియా పాత్ర ఎలా ఉండాలి, దాని పరిధి, పరిమితులపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో జరిగిన సంఘటలను సోదాహరణంగా వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భావితర జడ్జీలు ఎలా వ్యవహరించాలి అనే కోణంలో విశ్లేషణ చేశారు. పలు అంశాలపై సీనియర్ న్యాయమూర్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.
విశాఖపట్టణం ఏయూ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన సౌత్ జోన్–2 రెండు రోజుల జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో భాగంగా రెండో రోజు ఆదివారం జ్యుడీషియరీ అండ్ మీడియా, అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ థ్రూ ఎమెర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్ అనే అంశాలపై చర్చ నిర్వహించారు. ముందుగా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన కోర్టులు – మీడియా పాత్ర అనే అంశంపై చర్చ జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య వ్యవహరించారు. పీపీటీ ద్వారా పలు అంశాలపై వివరణ ఇచ్చారు. అనంతరం అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ పై జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన చర్చ జరగ్గా... కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎం. మ–ుస్తాక్యు, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సుందర్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ విధానాలను వివరించారు.
మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ పేర్కొన్నారు. అదే పరస్పర సహకారానికి ప్రామాణికంగా నిలుస్తుందన్నారు. రెండు అంశాలపై జరిగిన చర్చా వేదికలను ప్రారంభించిన ఆయన కోర్టు వ్యవహారాల్లో, సమాచార చేరవేతలో మీడియా పాత్ర, తీర్పులు, ఇతర ప్రొసీజరల్ అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర గురించి సుదీర్ఘంగా మాట్లాడారు. వాటి ఆవశ్యతను తెలుసుకోవాలని, వినియోగంపై విశ్లేషణ చేసుకోవాలని పేర్కొన్నారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాలు ప్రస్తుతం పోషిస్తున్న పాత్రపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తులకు సూచించారు.
ప్రాంతీయ సదస్సులో భాగంగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ ఫోర్త్ ఎస్టేట్ గా ప్రాచుర్యం సంపాదించుకున్న మీడియాలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయని, కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం చూపిస్తున్నాయన్నారు. ప్రజల గొంతుకగా పని చేస్తున్న మీడియా మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉందని పేర్కొన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను వార్తలుగా రాయకూడదని, నిజాలను నిర్ధారించుకొని వాస్తవాలను వార్తలుగా ప్రచురించాలని హితవు పలికారు. సున్నితమైన అంశాల్లో ఆచితూచి వ్యవహరించాలని, పరిస్థితులను అర్థం చేసుకొని నడుచుకోవాలని సూచించారు. ట్రయల్ అంశాలను ముందుగా బహిర్గత పరచకూడదని, ప్రతికూల ప్రభావాలను చూపరాదని హితవు పలికారు.తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పని చేసే వారంతా మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కోల్ కతాలో జరిగిన ఆర్జీకర్ ఆసుపత్రి ఘటన, ఇతర ఘటనల్లో మీడియా వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాకున్న పరిమితుల గురించి ఇరు వర్గాలూ తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీ అంశాలను వివరిస్తూ భవిష్యత్తులో వాటిని ఉదాహరణగా తీసుకొని జాగ్రత్త వహించాలన్నారు.కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సుందర్ విశ్లేషణ చేశారు. ఏఐ అనేది న్యాయమూర్తులకు సహకారిగా మాత్రమే ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు ఏఐ టెక్నాలజీని పరిగణనలోకి తీసుకోవచ్చని, కానీ దానినే తుది నిర్ణయంగా, అంతిమ ప్రామాణికంగా తీసుకోరాదని సూచించారు.కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం. ముస్తాక్యు బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి మాట్లాడారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ టెక్నాలజీ గురించి పీపీటీ ద్వారా వివరించారు. ఈ– కోర్టు రూముల గురించి, సాంకేతిక సిబ్బంది సహకారం గురించి తెలిపారు. కేరళలో కోర్టు వ్యవహారాల నివేదికలను రూపొందించేందుకు ఏఐ, గూగల్ నోట్ బుక్ సాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. ఏఐ వినియోగంలో సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సదస్సు ముగింపు సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ జ్యుడీషియల్ అకాడెమీ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ వందన సమర్పణ చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# అన్నసంతర్పణతో ముగిసిన శ్రీ శ్రీ శ్రీ బందరు మొగధారమ్మ జాతర



**మొగల్తూరు జనవరి 19(ఆంధ్రపత్రిక)** పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామంలో సత్తినేని వారి మెరకలో వేంచేసియ–ున్న గ్రామ దేవత శ్రీ బందరు మొగ దారమ్మ అమ్మవారి ఆలయం నందు (130వ వార్షికోత్సవం) జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ము–గిశాయి. ముగింపు సందర్భంగా అమ్మవారి ఆలయం నందు గ్రామానికి చెందిన భక్తుడు సత్తినేని రామకృష్ణ–సత్యవతి దంపతులు అమ్మవారికి సమర్పించిన 18 కేజీలు లడ్డు ప్రసాదమును కమిటీ సభ్యులు భక్తులు సమక్షంలో వేలంపాటి నిర్వహించగా సత్తినేని గణేష్ కుమార్ కుమారుడు తేజ రు 25 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. పాటదారుడు తేజకు 18 కేజీలు లడ్డు ప్రసాదాన్ని కమిటీ సభ్యులు సత్తినేని త్రిమూర్తులు, మేళం బన్ను, కత్తుల వీర్రాజు, ఉంగరాల పాని, సత్తినేని బాబులు, చవాకుల పాండురంగారావు, మేళం వాసు, సత్తినేని గజేంద్ర, సత్తినేని బాబ్జి, చౌధుల రాజు, పెనుగొండ వెంకటేశ్వరరావు, కటికల బాబురావు, కొప్పినేని బాబులు,శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించి అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు జాతర ముగింపు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామం నలుమూలల నుండి సుమారుగా 5 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదమును స్వీకరించారు.

# చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం తోట కళ్ళాల రోడ్డునిర్మాణానికి

## భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే కోళ్ల. సోంపురం గ్రామస్తుల వినతికి ఎమ్మెల్యే సానుకూల స్పందన.



**వేపాడ,జనవరి,19(ఆంధ్రపత్రిక):–**శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి చొరవతో చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది.మండలంలోని సోంపురం శివారు తోట కళ్ళాలలో గల ఇళ్ళకు రహదారి లేక ఏళ్ల తరబడి పొలం గట్లపై రాకపోకలు సాగించేందుకు అనేక అగచాట్లు గురికావలసి వస్తుంది.ప్రభుత్వాలు పాలకులు మారుతున్నా తోట కళ్ళాల వాసుల తలరాతలు మాత్రం మారలేదు.దాంతో సోంపురం గ్రామ పెద్దలు ఒక అడుగు ముందుకు వేసి స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి దృష్టికిఈ సమస్యను ఆదివారం నాడు తీసుకువెళ్ళి వినతి పత్రం కూడా సమర్పించారు.గ్రామస్తుల వేడుకోలుకు ఆమె సానుకూలంగా స్పందించారు.వెంటనే ఆమె ఆర్. అండ్.బి డి.ఈ దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్ళగా గ్రామ సభ తీర్మానం ఆమోదం తీసుకొని రోడ్డు నిర్మాణం పూర్తి చేద్దామని చెప్పారు. తక్షణమే రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన నిధుల వ్యయాన్ని అంచనా వ్యయాన్ని వేసి రోడ్డు నిర్మాణం వెయ్యాలని ఎమ్మెల్యే కోరారు.ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి చొరవ పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ బూత్ ఇంఛార్జి నెక్కల సత్యనారాయణ,మళ్ళా రమణ, నీటి సంఘం అధ్యక్షుడు జాగరపు రాము, నల్లబాబు,శేఖర్,చెల్లంనాయుడు,గొర్రుపోటు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పశుసంవర్ధన్ శాఖ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో పాణి



**మొగల్తూరు జనవరి 19 (ఆంధ్రపత్రిక)** మొగల్తూరు మండల పశుసంవర్ధన్ శాఖ అధికారి కార్యాలయాన్ని శనివారం ఉదయం మొగల్తూరు ఎంపీడీవో సిహెచ్ త్రిశూలపాని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ డాక్టర్ గొట్టుముక్కల నీలిమ ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయంలో శిథిలావస్థకు చేరిన ప్రదేశాలని శుభ్రపరిచి పాత రికార్డులను భద్రపరిచారు. ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో సిహెచ్ త్రిశూల్ పాణి సందర్శించి సంతృప్తికరం వ్యక్తం చేశారు. కార్యాలయంలో రికార్డులను సకాలంలో నిర్వహించి తగిన విధంగా భద్రపరచాలని డాక్టర్ నీలిమాకు సూచించారు. శిథిలావస్థకు చేరిన పశుసంవర్ధన్ శాఖ కార్యాలయాన్ని ఎంపీడీవో పాణి పరిశీలించి వెంటనే మరమ్మతులు చేసేందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని డాక్టర్కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పులపర్తి రామాంజనేయులు, ఎండి మస్తాన్, జి ప్రభాస్, వి మహేశ్వరి, బి ప్రవల్లిక తదితరులు ఉన్నారు.

# విశాఖలో ప్లాస్టిక్ నిషేధానికి పేజెస్, మిలీనియం సంస్థల సహకారం స్ఫూర్తిదాయకం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

**విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రపత్రిక):** విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి చైతన్యవంతంతో సహకరిస్తూ ముందడుగు వేసిన సామాజిక మాధ్యమ ప్రభావ శీలులు అందించిన సామాజిక సహకారం అందరికీ స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ, వైజాగ్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స ర్స్, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్నాకమ్యూనిటీ, మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆర్కే బీచ్ సమీపంలో నిర్వహించిన ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ కార్యక్రమానికి పుష్ప–2 చిత్రం నటి కుమారి పావని , జీవీఎంసి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.
ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ, విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స ర్స్ ముందుకు వచ్చిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స ర్స్ సామాజిక బాధ్యతతో అందిస్తున్న సహకారం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు కమిషనర్ తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విశాఖ నగరంలో 2025 జనవరి ఒకటి నుండి నిషేధించడమైనదని, అందుకు ముందస్తుగా 45 రోజులు పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించేలా ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించడమైనదన్నారు. నగరంలో ప్లాస్టిక్ వస్తువులను అన్నిటినీ జీవీఎంసీ నిషేధించలేదని,ఈ విషయాన్ని ప్రజలందరూ ముఖ్యంగా గమనించాలని, ఏవైతే ప్లాస్టిక్ వస్తువులు తిరిగి పునరుత్పత్తికి ఉపయోగపడని ప్లాస్టిక్ వస్తువులను మాత్రమే నిషేధించడమైనదని, అనగా 120 మైక్రాన్ల లోపు ఉన్నటువంటి ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా విశాఖ నగరంలో నిషేధించడమైనదని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు ప్రతి మనిషి జీవితంలో విడదీయరాని బంధంతో ముడిపడిపోతున్నాయన్నారు. మైక్రో ప్లాస్టిక్స్ మనకు తెలియకుండానే శరీరంలోకి వెళ్తూ క్యాన్సర్ కి కారణాలవుతున్నాయన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నగరంలో ప్రతి చోట, కాలువలలో, ప్రధాన గెడ్డలలో చిక్కుకొని ఒక ప్రధాన సమస్యగా పర్యావరణానికి హాని కలిగిస్తూ జీవీఎంసీ కి ఆర్థిక భారంగా ఉంటున్నాయన్నారు. ఒక్క విశాఖ నగరంలోనే ఒక్క రోజుకు 15 టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు ప్రజలు వినియోగిస్తున్నారన్నారు. వాటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన వస్తువులను ఉత్పత్తి ,సరఫరా చేసుకునేందుకు ఉత్పత్తిదారులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వారికి కల్పించేలా జీవీఎంసీ చర్యలు చేపడుతుందని, ప్రజలకు అవగాహన కల్పిస్తూనే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యాపారం, వినియోగం ,ఉత్పత్తి, సరఫరాదారులపై తదుపరి జరిమానాలు విధించడమే కాకుండా చట్టపరమైన చర్యలు కూడా చేపట్టబడతాయని




కమిషనర్ తెలిపారు. విశాఖ నగర పర్యావరణాన్ని కాపాడుతూ, ప్లాస్టిక్ రహిత నగరంగా దేశంలోనే విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు,విశాఖ నగరాన్ని అభివృద్ధి పదములు తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ యంత్రాంగం నిత్యం కృషి చేస్తుందని, అందుకు ప్రజా సహకారమే ఇటువంటి కార్యక్రమాలు మ–ుఖ్య భూమిక అని ఆ దిశగా ప్రజలందరూ నగర అభివృద్ధి సహకరించాలన్నారుఅనంతరం రాజమహేంద్రవరానికి చెందిన క్రంచి బిస్కెట్ కప్స్ ఉత్పత్తిదారులు విశాఖ నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రేరణ పొంది, ప్లాస్టిక్ పొర కలిగిన టీ, కాఫీ కప్పులు, ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగే వారికి ప్రత్యామ్నాయంగా రాగి పిండితో తయారుచేసిన క్రంచి బిస్కెట్ టీ కప్పులను ఉత్పత్తి చేస్తూ ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ "టీ తాగండి –కప్పు తినండి "అనే నినాదంతో ఏర్పాటు చేసిన "టీ "ని సరఫరా చేయగా ఆ క్రంచీ కప్పులో జీవీఎంసీ అధికారులతో కలిసి కమిషనర్ "టీ" ను సేవించి స్ఫూర్తిని కలిగించారు. ఇటువంటి సామాజిక స్పృహ కలిగిన క్రంచి కప్స్ ఉత్పత్తిదారులైన పొన్నాడ మణికుమారి, అలమూరి ఖేజియా లను అభినందించారు.అనంతరం విశాఖ నగరానికి చెందిన పుష్ప–2 చిత్రం సినీనటి కుమారి పావని మాట్లాడుతూ విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించిన జీవీఎంసీ యంత్రాంగానికి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మనిషిని ఈ ప్లాస్టిక్స్ ఆడంబరంగా ఆకర్షిస్తూ సకల మానవాళికి, మూగజీవుల ప్రాణాలకు హాని కలిగిస్తున్నాయని ,వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు, భావితరాలకు భవిష్యత్తు బాటవేసేలా మన పర్యావరణాన్ని కాపాడే దిశగా ఒక బృహత్తర కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రారంభించి నిర్వహిస్తున్నందుకు విశాఖ వాసులుగా మనమందరం మన ఆరోగ్యాలను మంచి పర్యావరణాన్ని కాపాడుకునేందుకు జీవీఎంసీ కి విశాఖ నగర ప్రజలందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్. వి నరేష్ కుమార్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన కలిగే అనర్థాలు ,ప్రత్యామ్నాయాలు వినియోగం వలన కలిగే లాభాలు, లభిస్తున్న వస్తువులు తదితర విషయాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్.ఎస్ .వర్మ ,డి.వి. రమణమూర్తి, జోనల్ కమిషనర్ కె .శివప్రసాద్, సహాయ వైద్యాధికారులు డాక్టర్లు కిరణ్ కుమార్, సునీల్ కుమార్, అప్పలనాయుడు, 600 మందికి పైగా సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స ర్స్, మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్ ప్రతినిధులు, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్నా కమ్యూనిటీ సభ్యులు, జీవీఎంసీ ఉద్యోగులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..!

(మొదటిపేజీ తరువాయి)

ఏకధాటిగా కురుస్తోన్న వర్షాలకు తడిచి ముద్ద అవుతున్నాయి. నైరుతి బంగాళాఖాతం- శ్రీలంక తూర్పు తీరం మీదుగా తాజాగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిం ది. సుమారు 2.5 కిలోమీటర్ల ఎత్తున విస్తరించి ఉన్న ఈ ఆవర్తనం మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనావేసింది. మరింత విస్తరించడానికీ అనుకూల వాతావరణం ఉందని పేర్కొంది. ఫలితంగా బెంగళూరు సహా కర్ణాటక లోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. బెంగళూరులో అర్ధరాత్రి ఆరంభమైన వర్షం ఏకధాటిగా ఉదయం 9 గంటల వరకూ దంచి కొట్టింది. ఎంజీ రోడ్, ఇందిరానగర్, ఎలక్ట్రానిక్ సిటీ, జయనగర, హెబ్బాళ, సుల్తాన్ పాళ్య, ఆర్టీ నగర, సహ కార నగర, విద్యారణ్యపుర, యలహంక, జాలహళ్లి, సంజయ్ నగర్, భద్రప్ప లేఅవుట్, హెచ్ఎస్ఆర్ లేఅవుట్.. వంటి ప్రాం తాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దక్షిణ బెంగళూరు (రామనగర), చిక్‌బళ్లాపురా, కోలార్, చామరాజనగర, మైసూర్, దక్షిణ కన్నడ.. వంటి జిల్లాల్లోనూ కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు, మరి కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఈ ఏడాది తొలి వర్షపాతం ఇదే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అటు తమిళనాడులోనూ ఈ ఆవర్తన ప్రభావం కనిపించింది. చెన్నై సహా పలు జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. పుదుచ్చేరి, కరైకల్ సహా తమిళనాడు ఉత్తర ప్రాంత జల్లాలు తంజావూరు, తిరువారూరు, నాగపట్నం, మైలాడుథురై, పుదుక్కోట్టై, రామనాథపురం, తూత్తుకుడి, తిరునెల్వేలి, కన్యకుమారి జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. దక్షిణ తమిళనాడు తీర ప్రాంతంలో గంటకు 35 నుండి 45 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. గాలుల తీవ్రత గంటకు 55 కిలో మీటర్లకు పెరిగే అవకాశం ఉన్నందున వచ్చే రెండు రోజుల పాటు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించింది.

# అసత్య ప్రచారాలు మానుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలెవ్వరూ నమ్మొద్దని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. విద్యుత్ వ్యవస్థపై జగన్మోహన్‌రెడ్డి కక్ష పెట్టుకున్నందుకే రోజూ అసత్యాల బురద చల్లుతు న్నాడని ఆరోపించారు. ఐదేళ్లు విధ్వంసం చేసిన విద్యుత్ వ్యవస్థను చంద్రబాబు అనతి కాలంలోనే తన అనుభవంతో సరిదిద్దారని అన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తుండటాన్ని చూసి జగన్ తట్టుకోలేకపోతున్నాడని మండి పడ్డారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల ప్రయోజనంపై అవగాహన లేక జగన్ అసత్యాలు ప్రచారం ప్రారంభించాడని విమర్శించారు. దీర్ఘకాలంలో పథకాల ప్రయోజనాలను ప్రజలు తెలుసుకుంటారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.ఎలాంటి అదనపు భారం లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే పీఎం కుసుమ్, సూర్యఘర్ పథకాల వల్ల నష్టమేంటో జగన్ చెప్పాలి..? అని మంత్రి ప్రశ్నించారు. కేంద్ర-రాష్ట్ర ప్రాయోజిక పథకాలైన సూర్యఘర్, పీఎం కుసుమ్ వల్ల విద్యుత్ వినియోగదారులకు మరింత లబ్ధి చేకూరుతుందని అన్నారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ మరింత మెరుగ్గా అందించవచ్చని పేర్కొన్నారు. రైతులకు ఫీడర్ లెవల్లోనే నాణ్యమైన విద్యుత్‌ను జగన్ వద్దంటాడా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యఘర్ ద్వారా నాణ్యమైన విద్యుత్ గృహ వినియోగదారులకు అందు తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

# గందరగోళంగా మారిన కుంభమేళా

(మొదటిపేజీ తరువాయి)

పరుగులతో ఆ ప్రాంతం అంతా గందరగోళంగా మారింది. వెంటనే ఫైర్ సిబ్బంది అలర్ట్ అయ్యారు. మంటలను అదుపులోకి తెచ్చారు. పెద్ద సంఖ్యలో టెంట్లు దహనం అయ్యాయి. భక్తులు అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు ప్రకటించారు. కోట్లాది మంది భక్తులు తరలి వస్తున్న కుంభమేళాలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాగ్ రాజ్ లోని తులసి మార్గ్ సెక్టార్ 19 లో మంటలు చెలరేగాయి. వారణాసిలోని వివేకానంద సేవా సమితి టెంట్‌లో భోజనం వండుతుండగా మంటలు చెలరేగినట్లు సమాచారం. ఇది అధికారికంగా ధృవీకరించలేదు. గ్యాస్ సిలిండర్లలో పేలుళ్లు సంభవించడంతో టెంట్లను మంటలు చుట్టుముట్టి పెద్ద ఎత్తున నల్లటి పొగతో ఎగసిపడ్డాయి. దాదాపుగా 20 నుంచి 25 టెంట్లు కాలి బూడిదైనట్లు తెలుస్తోంది. ఒక్క సారిగా మంటలు ఎగిసిపడటంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఎలాంటి నష్టమూ జరగలేదు. ఈ నెల 13న ప్రారంభమైన మహాకుంభ మేళాకు ప్రపంచ వ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 8 కోట్ల మంది వరకు పుణ్య స్నానాలు చేసినట్లు తెలుస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసారు. భక్తులు,స్వామిజీల కోసం ప్రత్యేకంగా టెంట్లు కేటాయించారు. ప్రస్తుతం అక్కడే సిలిండర్ పేలుడుతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భక్తులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మంటలు అదుపులోకి వచ్చాయని జిల్లా అధికారులు ప్రకటించారు.

# పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ పేరుతో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా, దావోస్లో జరిగే వరల్డ్ ఎకనామిక్‌ఫోరమ్ సదస్సుకు సీఎం వెళ్తున్నారు. ప్రపంచ బిజినెస్ దిగ్గజాలు హాజరయ్యే ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా ఏపీకి పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం ప్రయత్నం చేయనున్నారు. మొదటిరోజు జ్యూరిచ్లో 10 మంది పారిశ్రామికవేత్తలతో సీఎం చంద్రబాబు సమావేశమవుతారు. అనంతరం హోటల్ హయత్లో 'మీట్ అండ్ గ్రీట్ విత్ తెలుగు డయాస్పొరా' పేరుతో జరిగే తెలుగు పారిశ్రామికవేత్తల సమా వేశంలో పాల్గొంటారు. ఈ భేటీలో ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై సీఎం చర్చిస్తారు. అనంతరం దావోస్లో పారిశ్రామికవేత్తలతో సమా వేశంలో పాల్గొంటారు. ఆర్సెలార్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిత్తల్తో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం అవుతారు. రెండో రోజు సీఐఐ సెషన్లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై చర్చ, సోలార్ ఇంపల్స్, వెల్స్పన్, కోకకోలా, ఎల్జీ, కార్ల్స్‌బర్గ్, వాల్మార్ట్ ఇంటర్నేషనల్, సిస్కో, కాగ్నిజెంట్ తదితర సంస్థల చైర్మన్లు సహా సీఈఓలతో జరిగే సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరవుతారు. ఈ సమావేశానికి యూఏఈ ఎకానమీ మంత్రి అబ్దుల్లా బిన్ కూడా హాజరవుతారు. అనంతరం ఎనర్జీ ట్రాన్సిషన్ చర్చల్లో సీఎం పాల్గొంటారు. అంతర్జాతీయ మీడియా సంస్థలు నిర్వహించే చర్చాగోష్ఠులు, బ్లూమ్ బర్గ్ కు ఇచ్చే ఇంటర్వ్యూలో రాష్ట్ర విధానాలను ఆయన వివరిస్తారు. మూడో రోజు అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో సీఎం చంద్రబాబు సమావేశం కానున్నారు. రోజుకు కనీసం పదికి భేటీలు, సమావేశాల్లో చంద్రబాబు పాల్గొంటారు. నాలుగో రోజు ఉదయం సీఎం స్వదేశానికి బయల్దేరతారు.

# రాహుల్‌పై మరో కేసు..

(మొదటిపేజీ తరువాయి)

నమోదైంది. దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని ఇటీవల రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో ఈనెల 15న కాంగ్రెస్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నేతగా, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి ఉందని, దానికి బదులుగా ఆయన అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారని చాటియా ఎఫ్ఐఆర్లో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు.

# నా కుమారుడికి మరణ శిక్ష విధించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని.. వైద్యురాలు పడిన బాధను.. నరకాన్ని అర్థం చేసుకోగలనని ఆవేదన వ్యక్తం చేశారు. "నా కొడుకు చనిపోతే నేను ఏడుస్తానేమో.. కానీ ఓ అమ్మాయి పట్ల ప్రవర్తించిన తీరుకు.. సంజయ్ కు జీవించే హక్కు లేదు. అతడికి మరణ శిక్ష విధించినా మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. వైద్యురాలు నాకు కూతురితో సమానం. కుమార్తెకు ఇటువంటి పరిస్థితి వస్తే ఏ తల్లీ ఊరుకోదు" అని ఆమె అన్నారు..ఈ కేసుపై సుప్రీం కోర్టుకు వెళ్తారా అని మీడియా అడిగిన ప్రశ్నకు సంజయ్ సోదరి మాట్లాడుతూ.. ఆ ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. అతడు ఇలాంటి దారుణానికి ఒడిగడతాడని తామెప్పుడూ అనుకోలేదన్నారు. అయితే నేరం జరిగిన ప్రాంతంలో సంజయ్ పాటు మరికొంతమంది ఉన్నట్లు కథనాలు వస్తున్నాయని.. ఈ విషయంపై పోలీసులు, సీబీఐ క్షుణ్ణంగా దర్యాప్తు చేసి.. తగిన శిక్ష విధించాలని కోరారు.

# ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సమావేశమయ్యారు.ఈ పర్యటన అనంతరం రాష్ట్ర బృందం దావోస్ వెళ్లనుంది. ఈనెల 20 నుంచి 22 వరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొననుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం ఈ వేదికపై వివరించనున్నారు. గతంలో సుమారు రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చిన నేపథ్యంలో.. ఈసారి మరింత ఎక్కువ పెట్టుబడులు తీసుకురావాలనే యోచనలో ఉన్నారు. హైదరాబాదు ఫ్యూచర్ సిటీగా ఫోకస్ చేయడంతో పాటు కొత్తగా తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని వివరించనున్నారు.

# గిరిజనులకు అండగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉపరాష్ట్రపతి వెంకయ్యనా యుడు పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లిలో నిర్వహించిన గిరిజన ఆదివాసీ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. గిరిజన ఉత్పత్తులకు ఎ ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.ఆదివాసీల అభివృద్ధికి ప్రధాని మోదీ అనేక పథకాలు తెస్తున్నారన్న వెంకయ్యనాయుడు.. వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలన్నారు. తండాల్లో అక్షరాస్యత పెంపునకు పెద్దపీట వేయాలన్నారు. గిరిజనులు వారి స్వభాషతోపాటు తెలుగు, ఆంగ్లం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

# ఏపిలో 'అభివృద్ధి' పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

చింతించకండి. ఏపీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ అండదండలు ఉన్నాయి. మోదీ, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో మూడింతల ప్రగతి సాధిస్తాం.ఆరు నెలల్లో ఏపీకి రూ. 3లక్షల కోట్ల విలువైన సహకారం అందించాం. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు ప్రకటించాం. ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముందుకు తీసుకెళ్తాం. గత ప్రభుత్వం రాజధాని అమరావతిని బుట్టదాఖలు చేసింది. హడ్కో ద్వారా అమరావతికి రూ.27వేల కోట్ల సాయం అందిస్తున్నాం. ఏపీకి జీవనాడి అయిన పోలవరంపై సీఎం చంద్రబాబుతో చర్చించాను. 2028లోపు ఏపీ మొత్తం పోలవరం ద్వారా నీళ్లు పారిస్తాం. విశాఖ రైల్వేజోన్ ను కూడా పట్టాలెక్కించాం." అని అమిత్ షా అన్నారు.కేంద్ర హోం మంత్రి ఏపీ బీజేపీ నేతలకు కీలక దిశా నిర్దేశం చేసారు. ఏపీ పర్యటనలో భాగంగా పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కూటమి ప్రభుత్వంలో ఉన్నా.. పార్టీ బలోపేతం దిశగా తీసుకోవాల్సిన చర్యల పైన రోడ్ మ్యాప్ నిర్దేశించారు. పార్టీలో సమన్వయంతో పని చేయాలని.. కేంద్రం నుంచి ఏపీకి అందుతున్న సాయం గురించి పెద్ద ఎత్తున ప్రచారం



చేయాలని షా స్పష్టం చేసారు. విజయవాడలో జరిగిన విశ్వ హిందూ పరిషత్ సభ గురించి ఆరా తీసిన షా.. ఏపీలో తాజా పరిణామాల పైన చర్చించారు. ఏపీ బీజేపీ నేతలతో అమిత్ షా సమావేశంలో ఆసక్తి కర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఏపీలో కూటమి ప్రభుత్వ నిర్ణయాలు.. పార్టీ పరిస్థితి పైన ఆయన ఆరా తీసారు. పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారని ప్రశ్నించారు. పార్టీ సమావేశాల గురించి ఆరా తీసారు. పార్టీలో సమన్వయం ఉండాలని సున్నితంగా హెచ్చరించారు. ప్రభుత్వంలో కొనసాగుతున్నా.. పార్టీ పరంగా కార్యక్రమాలు.. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం నుంచి ఏపీకి పెద్ద ఎత్తున సాయం అందుతోందని.. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టం చేసారు. పార్టీలో బూత్ స్థాయి నుంచి బలోపేతం పైన మార్గనిర్దేశం చేసారు. ఏపీలో బీజేపీ ఎదిగేందుకు ఇప్పుడు అనుకూల సమయం ఉందని.. కేంద్రం అందిస్తున్న మద్దతు పైన ప్రజల్లో సానుకూలత ఉందని అమిత్ షా అభిప్రా యపడ్డారు. అమరావతి, పోలవరం, స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి నేతలు అందరూ కృషి చేయాలని, అంతర్గత విభేదాలు పక్కన పెట్టి.. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని అమిత్ షా ఆదేశించారు. హైందవ శంఖారావం సభ విజయవంతం అవడంపై వీహెచ్‌పీ నేతలు, పార్టీ నేతలను అమిత్ షా అభినందించారు. ప్రజలను భాగస్వాములను చేసే సభలు.. సమావేశాలు కొన సాగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పార్టీలో కమిటీల నియామకం గురించి అమిత్ షా ఆరా తీసినట్లు తెలుస్తోంది.

# ఎన్డీఆర్ఎఫ్ సేవలు గొప్పవి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. జపాన్, నేపాల్, తుర్కియేలో ప్రకృతి విపత్తులు వచ్చినపుడు సేవలు అందించిందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర యంత్రాంగం పరిష్కరించలేని సమస్యలను ఎన్డీఆర్ఎఫ్ పరిష్కరించిందని చెప్పారు. విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. "5 రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చేలా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఎస్ఐడీఎం) ప్రాంగణాన్ని ఏర్పాటు చేశాం. ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్, ఎన్ఎస్ఐడీఎం ప్రాంగణాలకు 50ఎకరాల భూమి కేటాయించాం వీటిని పూర్తిచేసిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. దేశంలో సమస్యల పరిష్కారానికి అమిత్ షా పట్టుదలతో కృషిచేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడటం సహా చాలా విషయాల్లో ఆయన వినూత్నంగా ఆలోచిస్తారు. కొన్నిసార్లు అమిత్ పనితీరు చూస్తే నాకు అసూయ కలుగుతుంది. ఏపీ పునర్నిర్మాణంలో వినూత్నంగా ముందుకెళ్లాలని అమిత్ సూచించారు. ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్తో ఘన విజయం సాధించాం. ఎన్నికల సమయానికి రాష్ట్రం వెంటిలేటర్పై ఉంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆ స్థితి నుంచి బయటపడింది. ఏపీ ఇంకా కోలుకోలేదు. రాజధాని అమరావతికి కేంద్రం నుంచి రూ.15 వేల కోట్లు ఇచ్చారు.. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల ఆర్థికసాయం చేసి ప్రాణం పోశారు. ఇటీవల విశాఖ రైల్వేజోన్ కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు కేంద్రం మద్దతు ఇంకా కావాలి. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ పనులు జరుగుతున్నాయి. కేంద్రం మద్దతుతో ఏప్రిల్ 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

# ప్రజాశక్తిని బలోపేతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రపంచ దేశాల ప్రజలు ప్రయాగరాజ్ వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నా రని తెలిపారు. కుంభమేళాకు పెద్ద సంఖ్యలో వస్తున్న యువతను అభినందించారు. దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకున్న ప్పుడే మన మూలాలు బలపడతాయన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. అయితే.. ఈ నెలలో చివరి ఆదివారం అయిన జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉండడం వల్ల నేడు(మూడో ఆదివారం) మన్కి బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారం చేశారు. "ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనది. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుంది. మన పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నాను" అని అన్నారు.ఎన్నికల సం ఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్టంచేస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతి కతను ఉపయోగిస్తూ.. నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందన్నారు. యువత అంకుర సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని ప్రధాని పేర్కొ న్నారు. దీంతో స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని.. సమాజంలో పరిస్థితులు మారిపోతున్నాయని అన్నారు. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోం దని.. దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. నేటి యువత తమ అభివృద్ధి గురించి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కృషి చేస్తోందని వెల్లడించారు. దీపక్ నబం అనే వ్యక్తి తాను స్థాపించిన అంకుర సంస్థ ద్వారా నిరాశ్రయులకు సహాయం చేస్తున్నాడని ప్రశంసించారు.

# కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పెంపొందించుకోవాలి

## ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

**పెదనందిపాడు,జనవరి 19 (ఆంధ్రపత్రిక) :** కుట్టు శిక్షణ పొందిన మహిళలు నేర్చుకున్న విద్యను స్వయం ఉపాధికి ఉపయోగించు కో వా లని కృష్ణ గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావుఅన్నారు. పెదనందిపాడు లోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ 3 వ బ్యాచ్ ముగింపు సభ ఆదివారం పెదనందిపాడు లోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో జరిగింది. ఈ సభకు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం మహిళలకు , విద్యార్థులకు ఎంత గానో ఉపయోగ పడుతుందని అన్నారు.ఈ విజ్ఞాన కేంద్రం ద్వారా కంపూటర్ శిక్షణ, ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తే విధ్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఉపయోగపడుతున్న విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను అభినందించారు.ఈ విజ్ఞాన కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు.ఈ ప్రాంతం లో నల్లమడ ఆధునీకరణ, గుంటూరు చానల్ పొడిగింపు సమస్య చాలా కాలంగా ఉందని , దాని పరిష్కారం కొరకు పని చేస్తానని తెలిపారు.పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం మంచి కార్యక్రమాలు చేస్తుందని , భవిష్యత్తులో నిర్వహించే అన్ని కార్యక్రమాలకు సహాయసహకారాలు అందిస్తానని అన్నారు.గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ భవిష్యత్తులో అందరి అవసరాల కోసం విజ్ఞాన కేంద్రం పైన ఒక హాలు నిర్మించేదుకు అందరి సహకారం తీసుకుంటామని అన్నారు.లక్ష్మణరావు ఈ ప్రాంతం లోని రైతులు, ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గుంటూరు చానల్ సమస్య పరిష్కారం కోసం అధికారులను, మంత్రులను, గత 5 సం.లుగా కలుస్తున్నారని, సమస్య పరిషారం కొరకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.ఎక్కడ సమస్య ఉంటే అక్కడ లక్ష్మణరావు గారు ఉంటారని అన్నారు.అలాంటి వ్యక్తిని రాబోయే శాసన మండలు ఎన్నికలలో గెలిపించుకోవలసిన అవుసరం, బాధ్యత మనపై ఉందని అన్నారు.అత్యధిక మెజారిటీ తో లక్ష్మణరావు గారిని గెలిపించాలని అన్నారు.అరవపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ కుట్టు శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు ద్వారా రుణం కావాలంటే తాను అందుకు సహకారం అందిస్తానని అన్నారు.ఉత్తమ ఉపాధ్యాయురాలు మక్కెన జవహర్ రాణి, సూరే రామ సుబ్బారావు, పఠాన్ సుభాని, గేరా మోహనరావు, నల్లపనేని శివప్రసాద్ లు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం నిర్వహించే అన్ని కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు .లక్ష్మణరావు గెలుపు కోసం తాము పని చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు,పెన్సనర్స్ అధ్యక్షులు జంపని రామారావు, కొమ్మూరు మాజీ సర్పంచ్ హరిబాబు, నూతి పూర్ణచంద్రరావు, కాపు వెంకట సుబ్బారావు, కొమ్మినేని శ్రీనివాస రావు,మర్రి లక్ష్మి,కన్నెగంటి చంద్రరావు,నల్లమోతు రాజేంద్ర, కుట్టు శిక్షణ టీచర్ కొర్రపాటి లక్ష్మి, కుట్టు శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో గెలవాలంటే వారి నిర్ణయమే 'పవర్' ఫుల్

**ఢిల్లీ,జనవరి 19 :** ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల రాజకీయం ఊపందుకుంది. మూడు ప్రధాన పార్టీలు గెలుపును ప్రతిష్ఠా త్మకంగా తీసుకున్నాయి. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఆకర్షణీయమైన హామీలు గుప్పిస్తు న్నాయి. బీజేపీ - ఆప్ మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సారి ఢిల్లీలో గతం కంటే భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. త్రిముఖ పోటీలో గెలుపు పైన మూడు పార్టీల్లోనూ అంచనా లు పెరుగుతున్నాయి. కానీ, ఇక్కడ గెలుపు ఇప్పుడు మహిళా ఓటర్ల పైనే ఆధార పడి ఉంది. దీంతో, వారి ఓటింగ్ ఎవరికి అనుకూలం అనేది ఆసక్తి కరంగా మారుతోంది. మహిళా ఓటర్లపై గురి ఢిల్లీలో మూడు ప్రధాన పార్టీలు హామీలు గుప్పిస్తున్నాయి. అధికారం నిలబెట్టుకోవాలని కేజ్రీవాల్ ముందుగానే రంగంలోకి దిగారు. ఎన్నికల్లో విజయం సాధించాలంటే మహిళా ఓటర్ల పాత్ర కీలకం గా మారింది. మొత్తం ఓటర్లలో 46శాతం అంటే సుమారు 71లక్షల మంది మహిళా ఓటర్లే ఉన్నారు. దీంతో మహిళలను ఆకట్టుకునే క్రమంలో భాగంగా ఆప్ నెలకు రూ 2,100 చొప్పున మహిళలకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. దీనికి పోటీగా బీజేపీ - కాంగ్రెస్ పార్టీలు రూ 2,500 ఇస్తామని హామీ ఇచ్చాయి. అదే విధంగా గర్భిణీలకు ఆర్థిక సాయం..బస్సుల్లో మహిళ లకు ఉచిత ప్రయాణం వంటి హామీలు ఇస్తున్నాయి.ఈ సారి ఢిల్లీలో అధికారం పై బీజేపీ భారీగా ఆశలు పెట్టుకుంది.

# జగన్‌పై అమిత్ షా ఆరా..



**అమరావతి,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** ఏపీలో రాజకీయ సమీకరణాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కూటమి పార్టీలు జగన్ లక్ష్యంగా రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర జమిలి ఎన్నికల దిశగా అడుగులు వేస్తున్న వేళ ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన పైన ఫోకస్ చేస్తోంది. తాజాగా అమిత్ షా కు చంద్రబాబు ఇచ్చిన విందు సమావేశంలో మహిళా రిజర్వేషన్ అమలు.. నియోజకవర్గాల పెంపు అంశం చర్చ కు వచ్చింది. అదే సమయంలో అమిత్ షా మాజీ సీఎం జగన్ గురించి ఆరా తీయటం ఆసక్తి కరంగా మారింది. జగన్ పై ఆరా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏపీ పర్యటనకు వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసం లో అమిత్ షాకు విందు ఇచ్చారు. ఈ సమయంలో చంద్రబాబుతో అమిత్ షా అనేక అంశాల పైన చర్చించారు. జగన్ గురించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. చంద్రబాబు నివాసం నుంచి ఇంద్రకీలాద్రి కనిపిస్తుండటం పైన అమిత్ షా ఆసక్తిగా గమనించారు. అదే సమయంలో జగన్ నివాసాలు.. రుషికొండ నిర్మాణం గురించి చర్చకు వచ్చింది. బెంగళూరులో జగన్ నివాసం గురించి లోకేష్ వివరించారు. జగన్ ప్రజల్లో తిరుగుతున్నారా అంటూ షా ప్రశ్నించారు. అందుకు బదులుగా ఎక్కువగా బెంగళూరులోనే ఉంటూ, అప్పుడప్పుడూ వచ్చి ప్రకటనలు మాత్రం ఇస్తున్నారని లోకేశ్ వివరించారు. సమస్యల ప్రస్తావన అంతరాష్ట్ర నదీ జలాల సమస్యలు ఉన్నాయా అని అమిత్ షా ప్రశ్నించారు. దీనికి స్పందనగా ప్రస్తుతానికి అలాంటివి ఏమీ లేవని.. కానీ, కృష్ణానదికి సంబంధించే వివాదాలు తలెత్తే అవకాశం ఉందని సీఎం వివరించినట్లు తెలిసింది. ఎన్టీఆర్ కు భారత రత్న గురించి చర్చకు వచ్చిన సమయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఎన్నాళ్లు పనిచేశా రని అమిత్‌షా ఆరా తీశారు. కాంగ్రెస్‌కు తరుచూ ముఖ్యమంత్రులను మార్చే సంస్కృతి ఉంది కదా అలాంటప్పుడు ఇక్కడ ఎక్కువకాలం ఎవరు పనిచేశారని అడగ్గా కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్కువ కాలం పనిచేయగా ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి ఆరేళ్లు సీఎంగా ఉన్నారని చంద్రబాబు బదులిచ్చారు. నియోజకవర్గాల పెంపు ఇదే సమయంలో ఎన్డీఏ పార్టీల సమన్వయం.. జమిలి ఎన్నికల గురించి వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక..మహిళా రిజర్వేషన్ల అమలు.. పార్లమెంట్ స్థానాల పెంపు గురించి చర్చించారు. కాగా, ఏపీ పునర్విభజన చట్టం మేరకు ఏపీలో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి 225 కి పెంచాల్సి ఉంది. దీంతో..దీని పైన ఎలా ముందుకు వెళ్లాలనే అంశం పైన చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాల పైన చర్చకు వచ్చిందని.. ఏపీలో తరహాలోనే తెలంగాణలో నూ కూటమి కొనసాగింపు పైన ప్రతిపాదన చేసినట్లు సమాచారం. కాగా, త్వరలోనే ఢిల్లీలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

# కొలికపూడి వ్యవహారం..

**అమరావతి,జనవరి 19 (ఆంధ్రపత్రిక):** ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వరుస వివాదాల పై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ వివాదాల పై నివేదిక కోరారు. సొంత పార్టీ నేతల నుంచే ఫిర్యాదులు రావటంతో చర్యలకు సిద్ధం అయ్యారు. అందులో భాగంగా పార్టీ క్రమశిక్షణా కమిటీ ఎదుట హాజరు కావాలని కొలికపూడికి తాజా గా ఆదేశాలు అందాయి. వరుస ఘటనల పైన వివరణ కోరనున్నారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కొలికపూడి పైన చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. కొలికపూడి తీరుతో తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు పై గెలిచిన సమయం నుంచే ఫిర్యాదులు ఉన్నాయి. ఆయన వ్యవహార శైలి పైన సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేసారు. దూకుడు స్వభావం .. వివాదాలు సమస్యగా మారాయి. కాగా, ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామం లో రెండు కుటుంబాల నడుమ నెలకొన్న ఆస్తి తగాదాలో తలదూర్చిన ఎమ్మెల్యే... ఎస్టీ దంపతుల పై దాడి చేశారు. తీవ్ర మనస్థాపానికి గురైన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన భూక్యా రాం బాబు, భూక్యా కృష్ణ అన్నదమ్ముల బిడ్డలు. వీరిలో భూక్యా రాంబాబు టీడీపీ నాయకుడు కాగా భూక్యా కృష్ణ వైసీపీ నేత. కృష్ణ భార్య చంటి పంచాయతీలో 5వ వార్డు సభ్యురాలు. ఈ రెండు కుటుంబాల నడుమ చాలాకాలంగా భూ వివాదం నడుస్తోంది. వివాదాలకు కేరాఫ్ తాజాగా కృష్ణకు చెందిన ప్రైవేటు భూమిలో రాంబాబు సీసీ రోడ్డు వేశారు. దీన్ని ప్రశ్నిస్తూ కృష్ణ రోడ్డుకు అడ్డంగా కంచె వేశారు. ఈ వివాదం ఎమ్మెల్యే కొలికపూడి దృష్టికి వెళ్లడంతో ఆయన శనివారం సాయంత్రం గ్రామానికి వచ్చారు. రాంబాబు ఎమ్మెల్యే అనుచరుడు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సీసీ రోడ్డును పరిశీలించి అనంతరం భూక్యా కృష్ణ, చంటి దంపతులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని దూషిస్తూ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దంపతులపై దాడి చేసి గాయపరిచారు. ఆ సమయంలో పోలీసులు కూడా అక్కడే ఉన్నారు. ఈ ఘటనతో మనస్థాపానికి గురైన చంటి పురుగుల మందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డారు. చంద్రబాబు సీరియస్ పోలీసుల సమక్షంలోనే దాడి జరగడంపట్ల ఆగ్రహంతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా స్థానికులు నినా దాలు చేశారు. వివాదం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన ఎమ్మెల్యే నుంచి వివరణ తీసుకోవాలని పార్టీ నేతలను ఆదేశించారు. ఈ వివాదంతో పాటుగా వరుసగా వస్తున్న ఫిర్యాదుల వేళ చర్యలు తప్పవనే అభిప్రాయానికి పార్టీ నాయకత్వం వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో, ముందు గా పార్టీ క్రమశిక్షణా కమిటీ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సోమవారం కొలికపూడి క్రమిశిక్షణా కమిటీ ముందు హాజరు అయి తన వివరణ ఇవ్వనున్నారు.







ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా,,,కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

## పర్యావరణ హిత

# వ్యవసాయానికి ప్రాధాన్యత



**రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ సంస్థల శాఖా మాత్యులు కింజరపు అచ్చెన్నాయుడు..**

**గుంటూరు, జనవరి 19 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ 2047 కలల సాకారంలో పర్యావరణహిత వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ సహకార మత్స్య తదితర శాఖల మాత్యులు కింజరపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆటోనగర్ లో మురుగప్ప గ్రూప్ వారి మౌంట్రా ఎలక్ట్రికల్ ట్రాక్టర్ షోరూమ్ ను మంత్రి అచ్చం నాయుడు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిలలో గ్రీన్ మొబిలిటీని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ మరియు తోటల అవసరాలకు ఎలక్ట్రిక్ ట్రాక్టర్ లను ప్రవేశ పెట్టడం ద్వారా కొత్త సాంకేతికత తో రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవడం జరుగుతుందన్నారు. తద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని ప్రభుత్వ లక్ష్యానికి దోహదం చేసినట్లుటుందన్నారు. బెంటరా ఎలక్ట్రిక్ ట్రాక్టర్ రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు నగరంలో ప్రవేశపెట్టడం శుభసూచకమన్నారు. తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పట్టణాల్లో నగరాల్లో వ్యర్థాల నిర్వహణలో పర్యావరణ హిత ట్రాక్టర్లను ఉపయోగించుకొని అవకాశం కలుగుతుందన్నారు. మెంట్రా ఎలక్ట్రికల్ ట్రాక్టర్ డివిజన్ సీఈవో కె హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ ట్రాక్టర్ల రంగంలో ఎలక్ట్రికల్ మొబిలిటీ వాహనాలు రైతులకు అన్ని విధాల మేలు చేస్తుందని లాభాలను ఆర్జించి పెడుతుందని వివరించారు. కార్యక్రమంలో మెంట్రా ఎలక్ట్రిక్ టాక్టర్స్ అదీకృత డీలర్ కే సుభాష్, శ్రీలక్ష్మి ఇన్ఫ్రా ఎక్విప్మెంట్ కంపెనీ ప్రతినిధులు లక్ష్మీ శ్రీకాంత్ పాత్రో, నేషనల్ సేల్స్ హెడ్ బలరామమూర్తి, ఏరియా మేనేజర్ బెహరా కిరణ్, సర్వీస్ మేనేజర్, రైతు సోదరులు వ్యవసాయ రంగ నిపుణులు, మెంట్రా ట్రాక్టర్ పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





గృహ మరియు పట్టణ వ్యవహారాల కమిటీ టూర్‌లో భాగంగా షిమ్లాలోని పలు ప్రాంతాలను సందర్శించిన కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి,, ఇతర కమిటీ సభ్యులు...





గిరిజన ప్రజా సమక్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఆదివాసీ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు..





గిరిజన ప్రజా సమక్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఆదివాసీ సమ్మేళనంలో తమ నైపుణ్యాలను ప్రదర్శించిన గిరిజనులు..

ఆంధ్రపత్రిక ఫోటోలు: సిహెచ్.విజయభాస్కర్



## హరిత సాయిని అభినందించిన

# మంత్రి నారా లోకేష్



**మంగళగిరి, జనవరి 19 (ఆంధ్రపత్రిక):** స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన తెలుగు టైప్ రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును సాధించిన మంగళగిరి –తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి యర్రబాలెంకు చెందిన ఆరాధ్యుల హరిత సాయిని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ మేరకు ఆదివారం హరిత సాయి నగరానికి చెందిన మాధవి టైప్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ పి.మురళీతో కలిసి మంత్రి నారా లోకేష్‌ను తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు టైప్ రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షలో హరిత సాయి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించడం అభినందనీయమని మంత్రి లోకేష్ కొనియాడారు. హరిత సాయికి టైప్ రైటింగ్‌లో చక్కని శిక్షణ ఇచ్చిన టైప్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ పి మురళీని మంత్రి లోకేష్ అభినందించారు.

# కొకైన్ కలకలం

**8.5 గ్రాముల కొకైన్ ను సీజ్ చేసిన ఎక్సైజ్ శాఖ గుంటూరు పోలీసులు**



**గుంటూరు జనవరి 19 (ఆంధ్రపత్రిక):** గుంటూరులోని శ్యామలా నగర్ వద్ద ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి కుకింగ్ కేసుగా నమోదు చేసిన గుంటూరు ఎక్సైజ్ పోలీసులు. గుంటూరు నగరంలో ఒక్క గ్రామ్ కొకైన్ ఆరు వేలనుంచి మూడు వెలబ్రూపాయల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందగా నిఘా పెట్టి నల్లచెరువు కు చెందిన ముగ్గురు వ్యక్తులు మాదకద్రవ్యాల వ్యాపారం చేస్తున్నారు అని సమాచారం అందగానే, ఆ ముగ్గురుని పట్టుకొని తమదైన సెల్‌లో విచారించి వారి వద్ద నుంచి ఏడు ప్యాకెట్లలో ఉన్న8.5 గ్రాముల కోకైను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు. గుంటూరు నగరంలో ఎవరైనా ఇటువంటి మాతక ద్రవ్యాలను గనక అమ్మకాలు జరుపుతుంటే వెంటనే 14500 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని కోరిన ఎక్సైజ్ పోలీసులు గంజాయి మాదక ద్రవ్యాలకు సంబంధించిన వివరాలు 14500 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరిన ఎక్సైజ్ అధికారులు.



## అయోధ్య రాముడికి టీటీడీ చైర్మన్

# పట్టు వస్త్రాలు సమర్పణ

**తిరుమల, జనవరి 19 (ఆంధ్రపత్రిక):** టీటీడీ తరఫున అయోధ్య రాముడికి చైర్మన్ బి.ఆర్.నాయుడు సతీ సమేతంగా ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. అయోధ్య ఆలయం వద్దకు చేరుకున్న టీటీడీ చైర్మన్ కు శ్రీరామ జన్మ భుమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ బృందం స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్ళి శ్రీరాముడికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు టీటీడీ బృందానికి ఆశీర్వాదం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ముఖ్య అర్చకులు గోపీనాథ్ దీక్షితులు, బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.







## అయోధ్యలో శ్రీవారికి వైభవంగా

# స్నపన తిరుమంజనం

**తిరుమల, జనవరి 19, (ఆంధ్రపత్రిక):** అయోధ్యలో శ్రీ శ్రీనివాసునికి స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని ఆదివారం టీటీడీ వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు దంపతులు హాజరయ్యారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకుల బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాసస్వామివారికి స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని సరయూ నది ఒడ్డున కన్నుల పండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన స్నపన తిరుమంజనం కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉత్తరాది భక్తులు హాజరయాయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచ సూక్తాలైన శ్రీ సూక్తం, భూసూక్తం, నీలా సూక్తం, పురుష సూక్తాలను అర్చకులు వల్లించారు. అభిషేకానంతరం తులసి మాలలతో ఉత్సవ మూర్తులను అలంకరించారు. సహస్రధారాపాత్రతో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.







ఆదివారం విజయవాడలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా పంచరత్న కీర్తనలు అందిస్తున్న సంగీత విద్వాంసులు...



Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com